honeybee.org
Vol-7 Issue-5

సంపుటి 7 సంచిక 5 జులై-ఆగస్టు 2019

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక











# కేవలం మనకోసమేనా?




'శిబి చక్రవర్తి'కి ఒకసారి పెద్ద సమస్య వచ్చిపడింది. ఒక పావురం రివ్వున వచ్చి ఆయన భుజంపై వాలి ఆయన్ను శరణు జొచ్చింది. దానికాయన అభయమిచ్చాడు. ఇంతలో పావురాన్ని తరుముతూ వచ్చిన ఒక డేగ శిబి తో "అయితే నేనేం తినాలి?" అని అడిగింది. దానికి శిబి చక్రవర్తి "ఈ పావురాన్ని తప్ప నీవింకే పావురాన్నయినా భుజించవచ్చు" అన్నాడు. దానికి డేగ "ఇదేం న్యాయం? నువ్వు ఈ పావురానికి ఇచ్చిన మాటని నిలుపుకోవటం కోసం ఇంకొక పావురాన్ని బలిచేస్తావా?" అంది. దానికి శిబి చక్రవర్తి మరైతే నువ్వు ఇంకే పక్షినైనా లేదా జంతువునైనా తిను" అన్నాడు. దానికి డేగ "నువ్వీ పావురానికి చేసిన వాగ్దానాన్ని నిలుపుకోవటానికి ఇంకో పక్షినో, జంతువునో బలి చేస్తావా?" అని ప్రశ్నించింది.

శిబి చక్రవర్తి ఏం చేశాడు? ఏం చేయగలడాయన? మానవులకి తమ లాభం కోసం ఇంకొకరి జీవితాలతో వ్యాపారం చేసే హక్కుందా? మానవులు కాని జీవాలు, ఒక్కొక్కటీ అంతరించిపోవడానికి ప్రధాన కారణం మానవుడే. పక్షులు, జంతువులు మానవులకు ఆహారంగా ప్రబలమైపోతున్న ఈ రోజుల్లో వాతావరణ సమతుల్యం రావాలంటే వివధ రకాల పక్షులు, కీటకాలు, చెట్లను కాపాడటానికి మనలో సరైన స్పృహ కలగాలి. అటువంటి అవగాహన కలిగేంత వరకు మనలో మార్పు రాదేమో? దీన్ని మనం ప్రకృతి నుంచి నేర్చుకోవాలా? పిల్లలే మనకు చెప్పాలా? లేక పైనున్న నీతి కథలను చర్చించి నేర్చుకుందామా?

– హనీబీ 19(4)–2008.

Vol-7, Issue - 5 July-August 2019

# విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-7 సంచిక -5 జులై-ఆగస్టు 2019

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-
for 5 years Subscription**


అశోక్ సృజనాత్మకత 3





ఉల్లి వ్యవసాయం 7

మోటార్ సైకిల్ ట్రాలీ 10





గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు 12



9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు 18

రైతు శాస్త్రవేత్త 'చిన్నిక్రిష్ణుడు' 22





ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు 26



జ్ఞానయజ్ఞం 29



మునగ ఆకు, వెలగ పండు లతో ఆరోగ్యం 30

స్పందన 32



కవర్ లోపలి పేజీల్లో ... **తెలియనిదాని గురించిన భయం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం'లో పల్లెసృజన వెలుగులు**


Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# పర్యావరణ రక్షణకు 'విత్తన విప్లవం'

రోజూ వాడే కూరగాయలు సమృద్ధిగా అందరికీ చేరాలన్నా, పండ్లు తినాలన్నా ముందుగా చెట్లు నాటాలి, పంటలు పండించాలి. వీటన్నిటికి గింజలు (విత్తనాలు) మూలం. విత్తనం పంటకు ఆత్మ అనటం అతిశయోక్తి కాదు. ప్రస్తుత ఉరుకు పరుగుల జీవన విధానంలో పర్యావరణాన్ని పట్టించుకునే తీరిక ఎవ్వరికీ లేకుండా పోయింది. ఇదిలాగే కొనసాగితే తినటానికి ఆహారం లభించదు, పీల్చడానికి గాలి, త్రాగడానికి నీరు లభించడం దుర్లభమవుతుంది. చెట్లు సమృద్ధిగా పెంచగలిగితే ప్రజలకు ఆహారంతో పాటు, గాలి, నీరు కూడా సమకూర్చగలుగుతాం. అందుకే పర్యావరణాన్ని సంరక్షించుకోవడానికి బాధ్యతగా తీసుకున్న కొందరు వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు చెట్లు నాటడమే ప్రథమ ధ్యేయంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హరిత హారం పేరుతో పెద్ద యెత్తున చెట్లు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చెట్లు నాటే విషయంలో భిన్నాభిప్రాయాలు లేవు, ఉండే అవకాశమే లేదు. అందుకే ప్రజల్లో హరిత చైతన్యం వచ్చింది. దేశమంతా అన్ని వర్గాలవారు ఈ హరిత యజ్ఞంలో మనస్ఫూర్తిగా పాల్గొనడం ప్రారంభమైంది. ఇది పర్యావరణానికి శుభసూచకం.

చెట్లు కావాలంటే విత్తనాలు కావాలి. మనమంతా రోజూ పండ్లు తింటున్నామే కాని, వాటి గింజలను కాపాడటంలో శ్రద్ధ వహించటం లేదు. పండ్ల గింజలను చెత్తబుట్టలో పడేయుటం వలన అది తిరిగి చెట్టుగా మారే అవకాశం లేకుండా నాశనమైపోతోంది. పర్యవసానంగా సహజంగా పెరగాల్సిన కోట్లాది వృక్షాలను సమాజం కోల్పోతోంది. పర్యావరణ రక్షణకు, హరిత విప్లవ విజయానికి సక్రమ విత్తనాల సేకరణ, రక్షణ, విత్తనాల ఎంపిక, అవసరమున్న చోటికి వాటిని చేరవేయటం లాంటి పనులు సమాజంలోని అన్ని వర్గాల మధ్య జరగాలి. స్కూలు విద్యార్థులకు విత్తనాల గురించి పాఠ్యాంశం ఉండాలి. ఇది ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్య వరకు కొనసాగాలి. తరగతి గది పాఠ్యాంశంగా కాకుండా వారితో చేయిస్తూ ఈ విత్తన జ్ఞానాన్ని పాఠశాల విద్యార్థులకు పంచాలి. గ్రామాల్లోని పెద్దవాళ్ళు విత్తనాల జ్ఞానాన్ని సేకరించి అందరికీ చేరేలా కార్యక్రమాలు చేపట్టాలి. దేశంలో ఎవరూ విత్తనాలను చెత్తబుట్టలో పడవేయకుండా, జాగ్రత్తగా కాపాడే పద్ధతిని అలవర్చుకోవాలి. తిన్న ప్రతి పండు నుండి వెలికి వచ్చిన గింజలను కాపాడే శ్రద్ధ, అవగాహన ప్రతి పౌరుడికి రావాలి. పెద్ద, చిన్న అందరూ గింజలు కాపాడటం ఒక బాధ్యతాయుతమైన చర్యగా పాటిస్తూ "విత్తన విప్లవం" సాగించాలి.

విత్తన విప్లవంలో ఉన్న నాలుగు ముఖ్యాంశాలను శ్రద్ధతో గమనించాలి. విత్తన సేకరణ, విత్తన రక్షణ, విత్తన విస్తరణ, విత్తన పునరుత్పాదన, ఏ పండ్లలో విత్తనాలుంటాయి, ఎలా వాటిని నష్టం కలుగకుండా వెలికి తీయటం మొదలైనవి. మన ఇండ్లలో ఉన్న చెట్లనుండి కూడా విత్తనాలు సేకరించవచ్చు. చెట్లు విత్తనాలు ఎక్కడ దాగున్నాయో, ఏ రూపంలో మనకు బాహ్యంగా కనిపిస్తాయో, వాటిని ఎప్పుడు సేకరించాలో, ఎలా సేకరించాలో అందరికీ ఈ విషయాలను అవగాహన కల్పించాలి. ప్రభుత్వ, సామాజిక సేవా సంస్థలు విత్తన సేకరణ జ్ఞానంపై విధి విధానాలను గ్రంథ రూపంలో, ఇతర మాధ్యమాల ద్వారా వివిధ భాషల్లో ప్రాచుర్యం కల్పించాలి

విత్తన విప్లవంలో 'విత్తన రక్షణ' రెండవ ముఖ్యాంశం. వాటి నాణ్యత తగ్గిపోకుండా రక్షించే వివిధ మార్గాలను, వివిధ దశలను అందరికీ వివరంగా తెలియజేయాలి.



మూడవ అంశం 'విత్తన విస్తరణ'. ఇది చాలా ప్రధానమైన పని. వ్యక్తిగతంగా కాకుండా సమాజంలోని ఇతర వ్యక్తులు, సంస్థలు ఇందులో భాగస్వాములు కావాలి. పలురకాల విస్తరణ మార్గాలను అందరికీ తెలిసేలా చెప్పాలి. కోట్లకొద్ది విత్తనాలను కనీస నష్టం (అధిక శాతం మొలకెత్తేలా)తో విస్తరణకై పటిష్ఠమైన ప్రణాళికలు తయారు చేయాలి. ప్రతి మూడు నెలలకు 'విత్తన విస్తరణ' దినం దేశమంతా పాటించాలి. ఇంతకాలం ప్రకృతిలోని పిట్టలు, పక్షులు, జంతువులు చేసే విత్తన విస్తరణను మనుషులు చేయాలి. విరివిగా, దేశమంతా తరచుగా, చిత్తశుద్ధితో ఈ విత్తన విస్తరణ కార్యాన్ని అమలు పరచాలి.

విత్తనాలను పరస్పరంగా మార్చుకోవడం, పంచుకోవడం లాంటివి చేయడానికి 'సీడ్ షేర్' వెబ్‌సైట్‌ను తయారు చేయాలి. ఈ విధానం విత్తనాలు ఉచితంగా పంపిస్తే, తపాలా శాఖ ఖర్చులు లేకుండా పంపించే విధానం ప్రభుత్వం ప్రోత్సహకర చర్యగా అమలు చేయాలి. రోజూ 25 కోట్ల విత్తనాలు ఈ విధంగా చేతులు మారాలి.

వృక్షమిత్ర 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత దరిపల్లి రామయ్య గారి లాంటివాళ్ళను ఈ కార్యక్రమాలకు మార్గదర్శకులుగా నియమించి, దేశవ్యాప్తంగా విత్తన విప్లవాన్ని 'ఇంటింటా విత్తనాలు' అన్న నినాదంతో విస్తారంగా అమలు పరచాలి.

ఈ విత్తన విప్లవానికై ప్రభుత్వం కోసం వేచి చూడకుండా ప్రతి ఒక్కరు ప్రారంభించాలి. విత్తన సేకరణ ఎవరైనా చేయవచ్చు కాని వాటి రక్షణ, విస్తరణకై కొన్ని నియమాలు, పద్ధతులు పాటించాలంటే సమాజంలోని కొన్ని సంస్థలు ప్రత్యేకంగా కృషి చేయాలి.

'పల్లెసృజన' విత్తన విప్లవ ఆలోచనను మనస్ఫూర్తిగా మీ ముందు విన్నవించుకున్నది. మీనుండి, సలహాలు, విమర్శలు, చేయూత.... అన్నింటినీ స్వాగతిస్తున్నాం.

ఈయేడు వర్షాకాలం రైతన్నలకు శుభప్రదం కావాలని మనసారా కోరుకుంటూ.....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



## నాలుగు రకాల వ్యవసాయ పనులు చేసే పరికరంతో

# అశోక్ సృజనాత్మకత

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘువ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ మండలం, అంజనీపురం గ్రామానికి చెందిన గొర్రె నాగరాజు, సావిత్రిల రెండవ కుమారుడు 'గొర్రె అశోక్' ఐటిఐ డిప్లమా చదువుతున్నాడు. సన్నకారు రైతు కుటుంబానికి చెందిన అశోక్ చిన్న రైతులు నాలుగు రకాల పనులు సులభంగా చేసేందుకు ఒక పరికరాన్ని రూపొందించాడు. కేవలం రెండు వేల రూపాయల వ్యయంతో నాలుగు రకాల పనులను చేసుకుని, వ్యవసాయ ఖర్చులను తగ్గించుకునేందుకు ఈ పరికరం ఉపయోగ పడుతుంది.

రైతు పంటలు పండించడంలో ప్రధానమైన నాలుగు దశలను గుర్తించాడు అశోక్. తాను గుర్తించిన ఈ నాలుగు దశలలోనూ పని చేసేందుకు ఒకే పరికరం సహాయంతో ఒకే వ్యక్తి చేసుకునేలా తయారు చేశాడు.

**వరికోత కోసిన తర్వాత గడ్డిని కుప్పలుగా వేయటం :**

సాధారణంగా రైతులు వరికోత కోస్తూ, వరిగడ్డిని ఎక్కడిదక్కడ వేసుకుంటూ వెళ్తారు. అలా కోత కోసిన వరిగడ్డిని రెండు లేదా మూడు రోజులు అలాగే పొలంపైన ఆరబెడతారు. దీన్ని కొన్నిచోట్ల 'మెద ఆరబెట్టడం' అంటారు. అలా ఆరబెట్టడం వలన ధాన్యంలోని తేమ శాతం కొంత వరకు తగ్గుతుంది. అప్పుడు వరిగడ్డిని చేతితో ఒక బల్ల లాంటి దానిపైన చేతితో కొట్టడం ద్వారా వరిగింజలు సులభంగా రాలి పడతాయి. లేకుంటే కొన్ని గింజలు వరిగడ్డికే అతుక్కుని వుండటం వల్ల రైతుకు నష్టం జరుగుతుంది.

ఈ క్రమంలో ఆ గడ్డిని చిన్న చిన్న కట్టలుగా కట్టడానికి ఒకచోట కుప్పగా పేర్చి కట్టలు కడుతూ వుంటారు. ఈ పనికి చాలామంది కూలీలు అవసరం అవుతారు. పైగా ఈ వరిగడ్డి రెండు మూడు రోజులు పొలంలో ఆరబెట్టడం వలన ఆ గడ్డి క్రింద పాములు, తేళ్ళు నివాసం ఏర్పరచుకోవడం కూడా జరుగుతూ వుంటుంది. కాబట్టి వరిగడ్డిని కుప్పలుగా చేసి, కట్టలు కట్టే కూలీలు చాలా జాగ్రత్తగా చేయాల్సిన పని ఇది.

అలా గడ్డిని ఈ పరికరంతో ఎంతో సులభంగా కుప్పలుగా చేసుకోవచ్చు. పైగా పురుగు పుట్ర వున్నా వాటివల్ల



మనుషులకు ఎలాంటి ప్రమాదమూ లేకుండా కేవలం ఒక వ్యక్తి వరిగడ్డిని కుప్పగా వేసుకుంటే వెళ్తే, వెనకాల ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు ఆ గడ్డిని కట్టలుగా కడుతూ వస్తారు. ఈ పరికరం సహాయంతో గడ్డి కుప్పలుగా వేయబడింది కాబట్టి అందులో పాములు, తేళ్ళు వుంటాయేమోనన్న భయం కూడా వుండదు కనుక కట్టలు కట్టే పనిని చకచకా చేసుకుంటూ వెళ్ళవచ్చు.

**వరి ధాన్యాన్ని కుప్పగా వేయటం :**

వరి ధాన్యాన్ని ఆరబెట్టడం తప్పనిసరి. ఒక్కోసారి అనుకోకుండా అకస్మాత్తుగా వర్షం వస్తుంది. అలా వర్షం వచ్చినపుడు ఆ ధాన్యాన్ని త్వరగా ఒక కుప్పగా వేసి, వాటిపైన టార్పాలిన్ కప్పకుంటే ధాన్యం తడిసిపోయి, మార్కెట్‌లో విలువ తగ్గిపోవటమే కాదు, ఒక్కోసారి ఆ దాన్యం అమ్ముకోవడం కూడా కుదరదు. అలా వర్ష సూచన వున్నపుడు వరి ధాన్యాన్ని వెంటనే కుప్పగా వేయాలంటే దాదాపు పదిమంది వ్యక్తులు కనీసం ఒక గంటసేపు కష్టపడితే కాని సాధ్యం కాదు. ఇలా కుప్ప వేయటానికి ఒక గంటలో పదిమంది చేసే పనిని ఈ పరికరం సహాయంతో ఒకేవ్యక్తి చేయవచ్చు.

**ప్రత్తి, మిరప పంటలలో అంతర సేద్యాలు చేయడం :**

అశోక్ గుర్తించిన మూడవ అంశం అంతర సేద్యం. ప్రత్తి, మిరప పంటలు మన తెలుగు రాష్ట్రాల రైతాంగానికి ప్రధానమైన పంటలు. ఈ పంటలలో అంతర సేద్యం అన్నది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ. అంతర సేద్యాలు చేయకుంటే కలుపు ఎక్కువగా పెరిగి, ప్రధాన పంటకు అందాల్సిన పోషకాలు ఈ గడ్డి తీసుకోవటం వల్ల పంట దిగుబడి తగ్గుతుంది. పైగా పొలానికి కూడా అవసరమైన సూర్యరశ్మి, గాలి సోకక పంటలకు కొన్ని పోషకాలు లభ్యమయ్యే అవకాశాలు తక్కువ. కాబట్టి అంతర సేద్యం చాలా అవసరమన్న విషయం ప్రతి రైతుకూ తెలుసు.

చిన్న, సన్నకారు రైతులు ప్రత్తి, మిరప పంటలలో అంతర సేద్యాలను ఎద్దులతో చేయించాలంటే కొంత ఖర్చుతో కూడుకున్న పని. ఈ పరికరంతో రైతే స్వయంగా, త్వరగా అంతర సేద్యాలను చేసుకుని కొంత వరకు ఖర్చును తగ్గించుకోవచ్చు.

**పొలంలో నాట్లు వేసుకునేందుకు అనువుగా అచ్చు పోయటం :**

అశోక్ గమనించిన నాలుగవ అంశం అచ్చు పోయటం. మిరప, కూరగాయలు, పొగాకు లాంటి పంటలు నాట్లు వేయటానికి వర్షం వచ్చే సమయానికి సిద్ధంగా వుంచుకునేందుకు ముందుగా సాళ్ళు (అచ్చు వేయటం అని కొన్ని ప్రాంతాలలో అంటారు) తోలి పెట్టుకుంటూ వుంటారు. ఇలా సాళ్ళు తోలుకునే పని కూడా ఎద్దులతో కాకుండా ఈ పరికరంతోనే చేసుకోవచ్చు.

కేవలం కొన్ని గుంటల భూమి వున్న రైతులు కూడా వుంటారు. అటువంటి రైతులు ఎక్కువగా తమకున్న ఆ కొద్దిపాటి పొలంలో మిరప లాంటి నారలు పోసి, పెంచి అమ్ముకుంటూ వుంటారు. ఆ తర్వాత పొలాన్ని ఖాళీగా వుంచుకోకుండా అందులో ఆకు కూరలు లాంటివి సాగు చేసుకుంటూ తమకున్న ఆ కొద్దిపాటి పొలం లోనే అత్యధిక సంపాదన పొందుతున్న రైతులు కూడా ఎంతోమంది వున్నారు.

వారికున్న ఆ తక్కువ పొలంలో ట్రాక్టరుతో కాని, ఎద్దులతో కాని దున్నుకోవడం లాంటి పని కుదరదు. ఎందుకంటే ఆ చిన్న కమతాల్లో ఇవి అటూ, ఇటూ తిరగడం కూడా కష్టమే. కాబట్టి కొందరు రైతులు చేతితోనే పార, పలుగు లాంటి వాటితో పొలాన్ని త్రవ్వి, ఎండ తగిలేలా చేస్తూ వుంటారు. అటువంటి వారికి ఇది ఎంతో ఉపయోగ కరమైన



పరికరం. పెద్ద కమతాల్లో రైతులు చేసే పనిని వీరు తమ చిన్న కమతాల్లో సులభంగానే చేసుకునే వీలుంటుంది. సరియైన అదనులో పొలాన్ని దున్నుకుని కొద్దిగా ఎండ తగిలితేనే పొలంలోని కొన్ని రకాల సూక్ష్మజీవులు నశిస్తాయి. పొలం కూడా ఎండ, గాలి బాగా తగిలి పంటకు అనువైన పోషకాలను తయారు చేసుకోగలుగుతుంది భూమి.

ఇలా చిన్న రైతు నుండి పెద్ద రైతు వరకు అందరూ ఉపయోగించుకునేలా తక్కువ ఖర్చుతో రూపొందించిన ఈ పరికరం ఉపయోగించటానికి ఎటువంటి ఇంధనం, మోటారు అవసరం లేదు. కేవలం ఒకే ఒక మనిషి చేయగలిగేలా వుంటుది. ఒకవేళ పెద్ద రైతులు తమకు దీనివల్ల ఎక్కువ శ్రమ అనుకుంటే ఇదే పరికరానికి చిన్న మోటారు కూడా అమర్చుకోవచ్చు అంటాడు ఇన్నోవేటర్ అశోక్. తనకున్న ఆర్థిక స్థోమతలో ఈ పరికరాన్ని తయారు చేశానని, ఎవరైన సహృదయులు సహకరించి, ఆర్థిక స్థోమత అందించ గలిగితే ఈ పరికరానికి ఒక మోటారును ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుతం చేసే పనులతో పాటు మరికొన్ని పనులకు ఉపయోగ పడేలా, తక్కువ శ్రమతో వ్యవసాయ పనులు చేసుకునేలా మార్పు చేయగలనని అంటున్నాడు అశోక్.

తక్కువ ఖర్చుతో, ఎక్కువ ప్రయోజనాలు చేకూర్చే ఈ పరికరాన్ని ఉపయోగించుకుని రైతులు తమ వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవటంతో పాటు, పొలంలోని పురుగు, పుట్రల వల్ల జరిగే అపాయాల నుండి కూడా కాపాడుకుంటారని సూచిస్తోంది 'పల్లెసృజన'.

పరికరం కావలసిన వారు సంప్రదించండి,ఇన్నోవేటర్
**గొర్రె అశోక్, ఫోన్ నెం.: 6305245698**

# వ్యసనాలకి - నాకు 50 ఏళ్ళ బంధం

**- పాటిబండ్ల లీలావతి**

యువత చెడిపోతోంది, చెడిపోయింది అనేవాళ్ళే గాని, ఎలాగైనా సరే బాగు చేసుకునే ప్రయత్నం చేసేవాళ్ళు చాలా అరుదు. తలుచుకుంటే చేయొచ్చు. కవులు, మేధావులు, నాయకులు, పౌరహక్కుల సంఘం నాయకులు, డాక్టర్లు, యాక్టర్లు, లాయర్లు, జడ్జీలు... ఇంతమంది ఉన్నారు. అయితే ఎవరికి ఈ ఆలోచన రాలేదా? ఎందుకో నాకే అనుకోకుండా, అకస్మాత్తుగా అనిపించింది. దీనికి కారణం 'పల్లెసృజన' ఇన్నోవేటర్స్, గణేశం గారు ఇచ్చిన స్ఫూర్తి.

సమస్య రాగానే ఏడవకూడదు. ఓహో మెదడుకు మేత దొరికింది అని ఆ సమస్యకి పరిష్కారం వెతకాలి. అసలైన ఆనందం అదే అనుకోవాలి. దాదాపు మనవళ్ళు, మనవరాళ్ళు ఈ భూమిమీద ఉంటారు. మన పిల్లలకి ఈ నిప్పు ఎందుకంటుకోదు. మన పిల్లలకి ఎంత సంపద ఇచ్చినా వాళ్ళమీద వాళ్ళకు ఆత్మవిశ్వాసం, నమ్మకం, ధైర్యం, ప్రేమ పెంచుకునేలాగా చెయ్యాలి.

పిల్లలకి చిన్నప్పటినుంచి వ్యసనం అంటే భూతంలాగా, దెయ్యం లాగా అనిపించాలి. స్నేహితుల వల్లనే పిల్లలు చెడిపోతున్నారు, చదువుల వత్తిడి కూడా ఎక్కువైంది. మనం తప్పు చేస్తే తల్లి, తండ్రి, అమ్మ మామలు నలుగురిలో తలయెత్తుకు తిరగలేరు, అవమానంగా భావిస్తారు, ఆస్తులు పోతాయి, కన్నబిడ్డలు అన్యాయం అయిపోతారు అని ముందునుంచే కొంచెం కొంచెంగా అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు మంచాన పడతారు, అయ్యో ఎంతో కష్టపడి పెంచి పెద్ద చేస్తే, ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఇలా అయిపోయారే అని దిగులు పడతారు. మనవళ్ళు, మనవరాళ్ళు.... భవిష్యత్తు ఎలా అని కుళ్ళి కుళ్ళి ఏడుస్తారు.

ఒక్క మనిషి వ్యసనం కోసం ఇంతమంది రోజూ జీవితాంతం ఎందుకేడవాలి? ప్రతి పైసా వాళ్ళకే చెందాలి అనేలా తయారు చేయటం మన కర్తవ్యం అని ప్రతి ఒక్కరూ అనుకోవాలి?

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

# జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-27111959)** సంప్రదించండి.



## సృజనాత్మక రైతు ఈదా ప్రతాప్ రెడ్డి ప్రయోగం

# ఉల్లి సాగులో వినూత్న పద్ధతి

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ఉల్లి సాగు చేసి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చాలామంది రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. మహారాష్ట్ర తర్వాత ఉల్లి సాగు అధికంగా వుండేది తెలుగు రాష్ట్రాలే అని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అందునా మహారాష్ట్ర ఉల్లికన్నా, మన తెలుగు రాష్ట్రాల ఉల్లికి దేశీయ మార్కెట్‌లో గిరాకీ పెరుగుతోందన్న విషయం రైతులందరికీ తెలిసిందే.

ఈ ఉల్లి పంటను సాధారణంగా రైతులు మొదట నారు పోసుకుని పెంచిన తర్వాత వాటిని ప్రధాన పొలంలో నాటు వేసి పండిస్తూ వుంటారు. ఉల్లి వ్యవసాయానికి పొలాన్ని బాగా దమ్ము చేసుకున్న తర్వాత వర్షా కాలం ప్రారంభానికి ముందే బోదెలు చేసి వుంచుకుంటారు. వర్షాలు ప్రారంభం కావటానికి 20–30 రోజుల ముందే నారుమళ్ళలో ఉల్లి విత్తనాలు వేసి, నారు పెంచుకుంటూ వుంటారు. ఈ ఉల్లి సేద్యానికి భూమిని తయారు చేయడం, నారుమడి తయారు చేసి నారును పోషించడం, వర్షం పడిన తర్వాత లేదా పొలానికి నీరు కట్టుకుని ఉల్లినారు నాటించడం ఈ పనులన్నిటికీ ఎకరానికి కనీసం 15 నుండి 20 వేల రూపాయలకు పైగా ఖర్చవుతుంది. అందునా ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నాటు కూలీల ఖర్చు విపరీతంగా పెరిగి పోవడంతో కొన్నిచోట్ల ఇంకా ఎక్కువగానే ఉంటుంది ఈ ఖర్చు.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఉల్లి పంటలో అంతర సేద్యాలు చేయడం అస్సలు కుదరదు. ఎందుకంటే అంతర సేద్యాలు చేసినట్లయితే ఉల్లిగడ్డలకు దెబ్బ తగిలే ప్రమాదముంది. అలా దెబ్బతిన్న ఉల్లిగడ్డకు మార్కెట్‌లో విలువ ఉండదు. కాబట్టి అంతర కృషికి ఎట్టి పరిస్థితుల్లో మనుషులతోనే కలుపు తీయించాల్సి వుంటుంది. అందుకే మిగతా పంటలకన్నా, ఉల్లి పంటకు ఖర్చు అధికంగా వుంటుంది. అయితే రైతులు ఈ పంటపై ఎక్కువ దృష్టి పెట్టడానికి కారణం మార్కెట్లో సాధారణంగా ఉల్లికి మంచి రేటు లభించటమే. మరో విషయం ఏమిటంటే కొన్ని గ్రామాల్లో రైతులు ఉల్లి రాళ్లలా వుంటుంది కాబట్టి ఉల్లి తూకం వెయ్యటం అంటే రాళ్ళని తూకం వేసినట్లే కాబట్టి మంచి దిగుబడి వచ్చిందంటే రేటు కాస్త తక్కువైనా ఫరవాలేదు అన్న భావంతో రైతులు ఉంటారు. ఉల్లి పంట వేయటం పట్ల రైతుల్లో మక్కువ వుండటానికి మరో ప్రధానమైన కారణం ఏమిటంటే, ఉల్లి దిగుబడి ఎలా వచ్చినా ఎక్కువ శాతం రేటు బాగానే వుంటుంది. రైతు అదృష్టం బావుండి, అధిక రేటు లభించిందంటే, ఆ సంవత్సరం ఆ రైతుకు పెద్ద లాటరీ తగిలినట్లే. ఒక రైతు ఉన్నఫలంగా లక్షాధికారి అయ్యేది ఉల్లి పంటతోనే అనే నమ్ముతారు కొంతమంది రైతులు. ఇదంతా ఉల్లి ఖర్చులు



తట్టుకుని పండించగల రైతులకే. మొత్తంమీద ఉల్లి సస్యరక్షణ చర్యలన్నీ కేవలం మానవ శక్తిమీదనే ఆధార పడి వుంటుంది.

కొందరు నారు పెంచే అవకాశం లేనివాళ్ళు వేరే రైతుల నుండి నారును కొని తమ పొలాల్లో నాటుకుంటూ వుంటారు. ఇలా నారు పెంచేవారు ఒక కిలో ఉల్లి విత్తనాల నారును పెంచటానికి రెండు వేల రూపాయల వరకు తీసుకుంటారు. సాధారణంగా ఎకరాకు 5 కిలోల విత్తనం నారుగా పోయాల్సి వుంటుంది. ఉల్లి నాటడానికి ఎకరాకు కనీసం 30 మంది కూలీలు అవసరమౌతారు. ఉల్లిని పొలంలో నాటేటపుడు మొక్క మొక్కకు మధ్య కేవలం రెండు లేదా మూడు వేళ్ళ దూరంలోనే నాటుతారు. అంటే మొక్కమొక్కకి మధ్యన ఒకటిన్నర లేదా రెండు అంగుళాల దూరం వుంటుంది అంతే. ఈ లెక్కన ఆయా ప్రాంతాల్లోని కూలీల రేటును బట్టి ఎకరాకు నారు పోయడానికి, నాటడానికి అయ్యే ఖర్చే 15 వేలకు పైగా వుంటుంది. ఇంత చేసినా ఉల్లి పొలంలో అంతర సేద్యాలు చేయడానికి రాదు కాబట్టి కూలీలతోనే కలుపు తీయించాల్సి వుంటుంది. ఇవన్నీ ఆలోచించి ఒక నూతన పద్ధతిని కనుగొన్నాడు సృజనాత్మక రైతు ప్రతాప రెడ్డి.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం 'కాజ' గ్రామానికి చెందిన రైతు ఈదా ప్రతాప రెడ్డికి భార్య ఇద్దరు కూతుర్లు (ఇద్దరికీ వివాహమైంది) 15 ఎకరాల పొలం వుంది. ప్రతి సంవత్సరం ఉల్లి, పసుపు పంటలను తప్పకుండా వేస్తూ వుంటాడు. వీలైనంత వరకు వ్యవసాయ ఖర్చులను తగ్గించాలి అనేదే ప్రతాపరెడ్డి ఆలోచన.

తన ఈ ఆలోచనతో అంతర సేద్యాలు ఎటూ చేయనపుడు ఉల్లి నారు పోసి, పెంచి, తిరిగి పొలంలో నాటడం ఎందుకు? నేరుగా పొలంలోనే విత్తితే సరిపోతుంది కదా అని ఆలోచించాడు. ప్రయోగాత్మకంగా చేసి చూద్దామని పొలాన్ని బాగా చదును చేసిన తర్వాత రెండు మీటర్ల వెడల్పులో బోదెలు ఏర్పాటు చేశాడు. పొలం మొత్తం నీరు పారించడం వల్ల ఉల్లి దెబ్బ తినే ప్రమాదం వుంటుందని రెండు మీటర్ల వెడల్పులో బోదెలు చేయడం ద్వారా పొలంలో నీరు ఆ బోదెలలోనే వెళ్ళడానికి ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత ఉల్లి విత్తనాలను ఇసుకలో కలుపుకుని, పొలం మొత్తం వెదజల్లిన తర్వాత



తేలికగా గుంటకతో పాపనం పాస్తాడు. ఎందుకంటే బరువుగా తోలితే ఉల్లి విత్తనం భూమి లోపలికి చొచ్చుకు వెళ్ళి మొలక ఎత్తడం కష్టమవుతుంది కాబట్టి తేలికగా గుంటక తోలడం జరిగింది.

సాధారణంగా నాటు వేసినప్పుడు ప్రతి ఉల్లి సాలుకు నీరు వదలటం బదులు బోదెలు చేసిన రెండు మీటర్ల వెడల్పులో నీరు వదులుకుంటూ వెళ్తాడు. కలుపు నివారణకు రసాయన మందు స్ప్రే చేయడం వల్ల అంతగా కలుపు రాలేదని, ఏదో కొద్దిగా వచ్చినా కూలీలతో తీయించడం జరిగిందని అన్నాడు.

ఈవిధంగా చేయటం వల్ల నారు పోషించే ఖర్చు, నారు నాటే ఖర్చు అస్సలు లేకుండా పోవడంతో ఎంతో డబ్బు ఆదా అయింది. దిగుబడిలో మాత్రం ఎటువంటి తేడా రాలేదన్నాడు రైతు ప్రతాప రెడ్డి. గత మూడు సంవత్సరాలుగా తాను ఈ పద్ధతినే పాటిస్తున్నానని, అందువల్ల ఎకరాకు 15 నుండి 20 వేల వరకు ఖర్చు మిగులుతోందన్నాడు. దిగుబడి సాధారణంగా అందరికీ వచ్చినట్లే ఎకరాకు 9 నుండి 10 టన్నుల వరకు వచ్చిందని, గత సంవత్సరం మాత్రం ఏదో వాతావరణం తేడానో ఏమో తెలీదుగాని, మిగతా వారిలాగే



నాకు కూడా 7 టన్నుల వరకు దిగుబడి వచ్చిందని అన్నాడు. ఈ విధానంలో చేయటం వల్ల అతను వేసిన 3 ఎకరాల ఉల్లిలో 45 నుండి 60 వేల వరకు ఖర్చు తగ్గించుకున్నాడు. దిగుబడిలో కాని, నాణ్యతలో కాని ఏమాత్రం తేడా నాకు అగుపించ లేదని, యావత్ రైతాంగం కూడా ఈ విధానాన్ని అనుసరిస్తే ఎంతో ఖర్చు ఆదా చేసుకోవచ్చని అంటున్నాడు సృజనాత్మక రైతు ప్రతాప రెడ్డి.

ఈ విధానాన్ని ఉల్లి పండించే రైతులందరూ పాటించి, మీ ఉల్లిసాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. రైతు తన సేద్యంలో ఒక రూపాయి ఖర్చు తగ్గిస్తే, ఆ రూపాయ మేర తనకు ఆదాయం పెరిగినట్లే. ఈవిధంగా ఖర్చు తగ్గించే మార్గం కనుక, ఎటూ అంతర సేద్యాలు చెయ్యడానికి వీలులేని ఉల్లి పంటలో ఉల్లినారు పోయడం, నారు నాట్లు వేయించడం లాంటి అనవసరమైన ఖర్చులను తగ్గించుకుంటే ఆదాయం పెరిగినట్లే కదా! ●

**సృజనాత్మక రైతు ప్రతాప రెడ్డి ఫోన్ నెం. : 9848491685**

## ఆంధ్రప్రదేశ్ శాసన సభలో 'పల్లెసృజన' వాణి

కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాల్లో 26-7-2019న 'పల్లెసృజన' చేస్తున్న పనులను, ప్రభుత్వం ఇటువంటి వాలంటరీ వ్యవస్థలకు ప్రభుత్వం చేయూతను అందించాల్సిన అంశాలను గురించి దాదాపు 10 నిమిషాల పాటు ప్రసంగించడం జరిగింది.

పునాది స్థాయి సృజనాత్మకతలను వెలుగులోకి తీసుకు రావడానికి గత 13 సంవత్సరాలుగా చేస్తున్న కృషికి ఒక రాష్ట్ర శాసన సభలో మన వాణి వినిపించడం 'పల్లెసృజన' అభిమానులకు, ఇన్నోవేటర్లకు ఆనంద దాయకం.

సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో కూడా 'పల్లెసృజన' కార్యక్రమాలకు ప్రభుత్వ పూర్తి సహకారం లభించి, మరెన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి రావటమే కాక, ఇన్నోవేటర్లు తయారు చేసిన పరికరాలు కూడా సమాజానికి ఇంకా అందుబాటులో వస్తాయని భావిస్తున్నాము. మీరు ఈ కార్యక్రమం గురించిన వీడియోను వీక్షించాలంటే ఇంటర్నెట్‌లో https://www.youtube.com/watch?v=LzR2tg3gZtQ&feature=youtu.be టైప్ చేస్తే యూట్యూబ్‌లో వీక్షించవచ్చు.

- ఎడిటర్

### గ్రామీణ రవాణాలో రైతులు, చిన్న వ్యాపారస్తులకు ఎంతో అనువైన ఇన్నోవేషన్

# మోటార్ సైకిల్ ట్రాలీ

సమాజంలోని ప్రతి వ్యక్తి తన కష్టానికి పరిష్కారం ఎక్కడ దొరుకుతుందా అని వెతికి, ఎక్కడా దొరకనప్పుడు తానే స్వయంగా చేసుకునే పరిష్కారమే 'ఆవిష్కరణ' (ఇన్నోవేషన్). ఇంత వరకు 'పల్లెసృజన' గమనించిన అందరు ఇన్నోవేటర్లు తమకు లేదా తన చుట్టూ వున్న సమాజం పడుతున్న కష్టాలను తీర్చటానికి తమ ఆలోచనలకు పదును పెట్టి చేసిన పరిష్కారాలే ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లు.

ఈ పరంపరలో మార్పు చెందుతున్న సమాజంలో తాము చేస్తున్న పనులలో ఎంతో కొంత ఖర్చు తగ్గించు కోవడానికి ఇటీవల వెలుగులోకి వచ్చింది 'మోటార్ సైకిల్ ట్రాలీ'.

ఒకప్పుడు ప్రతి రైతుకు ఎద్దులు, ఎద్దుల బండి





వుండేవి. నాడు వ్యవసాయ కూలీలు కూడా రైతు పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్ళి పొలం పనులు చేసి వస్తూ వుండేవారు. మారుతున్న కాల ప్రభావం వల్ల గ్రామానికి దగ్గరగా వుండే పొలానికైతేనే కూలీలు రావటానికి సుముఖత చూపడం, దూరంగా వుండే పొలాలకు వెళ్ళటానికి ఇష్టపడక పోవటం వల్ల గ్రామానికి దూరంగా పొలం వున్న రైతులు దీనికి పరిష్కారంగా కూలీలను ఆటోల్లో లేదా ట్రాక్టర్లలో తరలించడం తప్పనిసరైంది. ట్రాక్టర్లు వున్న రైతులకు ఫరవాలేదు కానీ లేనివారు కూలీలను పొలం వద్దకు తరలించేందుకు మరో అదనపు భారంగా తయారైంది ఆటో కిరాయి. ఈ సమస్యకు పరిష్కారం దేశంలో ఎవరు కనుగొన్నారో 'పల్లెసృజన' వెతకలేక పోయింది.

కానీ, మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మాకు తెలిసినంత వరకు నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన మల్లయ్య అనే రైతు, విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ ఈ సమస్యకు పరిష్కారంగా తన మోటార్ సైకిల్‌కు ట్రాలీ ఏర్పాటు చేసుకుని, తన పొలం నుండి ప్రత్తిని ఇంటికి చేరవేయటానికి వినియోగించున్నాడు. అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన 'భాస్కర రెడ్డి' అనే రైతు తన మోటార్ సైకిల్‌కే ఒక ట్రాలీ తయారు చేయించుకున్నాడు. దాన్ని తయారు చేసుకోవడం ద్వారా అందులో తన పొలానికి కూలీలను తరలించడమే కాదు, పొలానికి అవసరమైన ఎరువులు చేరవేయడం, పొలం నుండి వ్యవసాయ దిగుబడులను ఇంటికి చేరవేయటం లాంటి పనులన్నీ ఈ





ట్రాలీతోనే చేసుకుంటున్నాడు.

ఇక్కడ యావత్ రైతాంగం గమనించాల్సింది ఒక్కటే దీన్ని ఎవరు తయారు చేసి ఇస్తారు? ఖరీదు ఎంత? ఎలా తెప్పించుకోవాలి? లాంటి ప్రశ్నల జోలికి పోకుండా మీకు సమీపంలోని ఏ వెల్డింగ్ దుకాణాలకు పోయి ఈ వ్యాసంలో ప్రచురించిన ఫొటోలను చూపించినట్లయితే వారే మీకు అవసరమైన ట్రాలీని తయారు చేసి ఇస్తారు.

ఈ ట్రాలీ కేవలం రైతులకే కాదు, చిన్న చిన్న వ్యాపారస్తులు తాము అమ్మాలనుకునే వస్తువులు, ఇటుకలు, ఇసుక, కంకర లాంటివి చేరవేసుకోవటమే కాక, వాటిపైననే వ్యాపారం కూడా చేసుకోవచ్చు.

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.... ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరికీ మోటార్ సైకిల్ వుంది. దానికి అనుసంధానం చేసేదే ఈ ట్రాలీ. కాబట్టి అవసరం లేదు అనుకున్నపుడు ట్రాలీని విడదీసి మోటార్ సైకిల్‌ను తమ అవసరాలను వినియోగించుకోవచ్చు. కాకపోతే ఇందులో ఒక చిన్న సమస్య ఉత్పన్నమౌతుంది. ఇలా మోటార్ సైకిల్‌కు ట్రాలీని ఏర్పాటు చేసుకుని పట్టణాల్లో ప్రయాణిస్తే రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసు వారు అనుమతిస్తారా? అన్న అనుమానం తప్పక తలెత్తుతుంది.

కాబట్టి ప్రస్తుతానికి గ్రామీణ ప్రాంతాల రైతులు, గ్రామాలపై ఆధారపడి వ్యాపారం చేసుకునే నిరుద్యోగులు ఉపయోగించుకోండి. తయారు చేయించుకుని ఉపయోగిస్తున్న రైతులు, తయారు చేసేవారు మీ అనుభవాలను 'పల్లెసృజన'తో పంచుకుంటే యావత్ తెలుగు రైతాంగానికి తెలియజేస్తాం. రవాణాశాఖ నుండి ఉత్పన్నమయ్యే సమస్యను పరిష్కరించడానికి 'పల్లెసృజన' తప్పక కృషి చేస్తుంది. త్వరలోనే దీనికి పరిష్కారం దొరుకుతుందని ఆశిద్దాం. ●













జాతీయ అవార్డు పొందిన

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## కోళ్ళ ఫారాల్లో నేలను తిరగతోడే (రేకింగ్) యంత్రం

**సమస్య – పరిష్కారం :**

కోళ్ళు ఆరోగ్యదాయకంగా పెరగాలంటే తరచూ కోళ్ళ ఫారాలలోని నేలను తిరగతోడుతూ వుండాలి. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. చాలామంది కూలీలు అవసరం అవుతూ వుంటారు.

ఈ ఖర్చును తగ్గించటానికి గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'సురేష్ భాయ్ నరోత్తమ్ భాయ్ పటేల్' అనే రైతు 'పౌల్ట్రీ రేకింగ్' యంత్రాన్ని తయారు చేసుకున్నాడు.

**పరికరం :**

కరెంటుతో పనిచేసే ఈ యంత్రం కోళ్ళ ఫారంలోని నేలను తిరగతోడి మళ్ళీ చదునుగా చేస్తుంది. యంత్రానికి అమర్చిన ఒక హ్యాండిల్ పట్టుకొని నడుపుతూ వుంటే చాలు. మోటారును యంత్రంలోని ఒక పుల్లీతో అనుసంధానం చేసి, తద్వారా చైన్ సహాయంతో స్ప్రాకెట్ తిరిగేలా ఏర్పాటు చేశాడు. మోటారు వేగాన్ని 1 : 34 నిష్పత్తిలో తగ్గించాడు. తిరగ తోడటానికి బ్రేడ్లు కల చక్రాలను అమర్చాడు.

**సాంకేతిక వివరాలు :**

❀ 1400 ఆర్.పి.యం. కలిగిన సింగిల్ పేజ్ మోటారును ఉపయోగించడం జరిగింది.

❀ 25 సెంటీమీటర్ల వ్యాసార్థం కలిగిన పుల్లీ ఒకటి, 8 సెం.మీ. వాసార్థం గల పుల్లీ ఒకటి ఉపయోగించబడింది.

❀ 2 సెం.మీ. వెడల్పు కలిగి, 103 సెం.మీ. పొడవుగల 'వి' బెల్టును ఉపయోగించడమైంది.

❀ 25 సెం.మీ గల స్ప్రాకెట్ ఒకటి, 6 సెం.మీ. వాసార్థం కలిగిన స్ప్రాకెట్ ఒకటి, మొత్తం రెండు స్ప్రాకెట్లను వినియోగించడమైంది.

❀ 1.5 సెం.మీ. వెడల్పు, 85 సెం.మీ పొడవు కలిగిన చైను వినియోగించడమైంది.

❀ రేకింగ్ కొరకు 75 సెం.మీ. పొడవు గల స్టీలు బ్లేడ్లను వినియోగించాడు.

❀ 40 సెం.మీ. వ్యాసార్ధ కలిగిన రెండు లోహపు చక్రాలను అమర్చాడు.







**ముఖ్యాంశాలు :**

- ❀ ఈ యంత్రాన్ని వాడటం వలన 50% వరకు కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చు.
- ❀ సాధారణంగా 6 గంటల్లో చేసే పనిని, ఒక గంటలో చెయ్యవచ్చు.
- ❀ ఇద్దరు మనుషులు 15,000 చదరపు అడుగుల స్థలాన్ని రేకింగ్ చేయవచ్చు.
- ❀ కోడిపిల్లలు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా పెరగటానికి రేకింగ్ చేయటం తప్పనిసరి.
- ❀ కూలీలతో చేసే రేకింగ్‌కన్నా, ఈ యంత్రంతో చేసిన రేకింగ్ వలన కోళ్ళ ఫారాలలో దుర్గంధం తగ్గటం గమనించ వచ్చు.

**పురస్కారాలు :**

- ❀ 2013లో ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ప్రోత్సాహక బహుమతి లభించింది.

**వివరాలకు సంప్రదించండి :**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్ : 9652801700**
E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



శ్రీతైలం

యూరియా

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

<u>'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :</u>
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.



సోలార్ స్ప్రేయర్



కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు

# కోడిగుడ్లు పొదగబెట్టే పరికరం (ఎగ్ ఇంక్యుబేటర్)

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

కోళ్ళ పెంపకం అన్నది గ్రామీణ ప్రాంతాల్లో, ప్రత్యేకించి యువతకి మంచి ఉద్యోగావశాలు, ఆదాయము కల్పించే వ్యాపకం. చాలామంది సాధారణంగా చిన్న కోడిపిల్లలను కొని, వాటిని పెద్దగా అయ్యేంత వరకు దాణా వేసి పెంచి, ఒక వయసు వచ్చిన తర్వాత లాభసాటి ధరకు అమ్మి లాభం చేసుకోవటం జరుగుతూ వుంటుంది. ఇటువంటి వారు కోడిపిల్లలను కొనే బదులు ఒక ఇంక్యుబేటర్ ఏర్పాటు చేసుకొని గుడ్లనుండి పిల్లలను పొదిగించ గలిగితే ఇంకా లాభసాటిగా వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుంది. బజార్లో లభించే ఎగ్ ఇంక్యుబేటర్లు చాలా ఖరీదైనవై యుండి, కరెంటుతో పనిచేసేలా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాలలో తరచూ కరెంటు సమస్యలు తలెత్తుతూ వుండటం వలన అంత ఖరీదు పెట్టి కొనటానికి చాలామంది వెనకాడుతూ వుంటారు.

ఈ సమస్యను పరిష్కరించటానికి అస్సాం రాష్ట్రానికి చెందిన 'మిలాన్ జ్యోతి దాస్' అనే మహిళా రైతు ఒక ఎగ్ ఇంక్యుబేటర్‌ను రూపొందించింది. ఇది చాలా చవకగా లభించటమే కాకుండా, కరెంటుతోను, కరెంటు లేని సమయాల్లో కిరోసిన్ దీపంతో పని చేస్తుంది.




**పరికరం :**

ఈ పరికరాన్ని ఒక చెక్క డబ్బాలో, వేడిని నియంత్రించటానికి 10 సెం.మీ. మందం గల థర్మాకోల్‌లో తో గోడలను ఏర్పాటు చేసి, వాటిపైన పలుచని రేకును అతికించింది. ఈ డబ్బాలో పైన ఒకటి, క్రింద ఒకటిగా రెండు అరలను ఏర్పాటు చేసింది. పై అరలో ఒక ట్రేలో గుడ్లను ఉంచాల్సి వుంటుంది. ఈ అరను కొంతవరకు నీటితో నింపి, ఆ నీటిలో మరో ట్రేలో పొదగ వలసిన గుడ్లను ఏర్పాటు చేస్తారు. ఇందులో అవసరమైనంత తేమ అందుబాటులో వుండేలా ఏర్పాటు చేసింది. క్రింది అరలో వేడి పుట్టించటానికి తగిన ఏర్పాటు చేసింది. వేడి తగ్గిపోతే ఒక గంట మోగేలా కూడా ఏర్పాటు చేయబడింది. ఈ క్రింది అరలో వేడిని పుట్టించటానికి కరెంటు ఉన్నపుడు బల్బు వెలిగించడం, లేనపుడు కేవలం ఒక కిరోసిన్ దీపం ఏర్పాటు చేస్తే పైనున్న అరకి, క్రింది అరకి మధ్యనున్న రెండు పొరలుగా వున్న పలుచని రేకు వేడెక్కి పై అరలోకి కావలసిన వేడిని అందిస్తుంది.

వేడిని నియంత్రించేందుకు బల్బు వెలుగును ఎక్కువ– తక్కువ చేసేందుకు మామూలు ఫ్యానుకు వాడే



రెగ్యులేటర్‌ను ఉపయోగించడం జరిగింది. పై అరలోని నీరు గుడ్లు పొదగడానికి అవసరమైనంత వెచ్చని తేమ గుడ్లకు అందటం ద్వారా గుడ్లు పొదగ బడతాయి. అవసరమైనంత గాలి బైటనుండి రావటం కొరకు క్రింది అరలో రెండుచోట్ల, పై అరలో రెండు చోట్ల రంధ్రాలు చేయబడి వాటికి ట్యూబులు అతికించి ఏర్పాటు చేయడమైనది.

**సాంకేతిక వివరాలు :**

❀ మొత్తం పరికరం బరువు 125 కిలోలు ఉంటుంది.

❀ ఈ పరికరం వెడల్పు 80 సెం.మీ., 1.5 మీటర్ల పొడవు, ఒక మీటరు ఎత్తు వుంటుంది.

❀ వేడిని ఉత్పత్తి చేయటానికి కరెంటు బల్బు లేదా కిరోసిన్ దీపాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు.

❀ ఒకేసారి 500 గుడ్లను పొదగబెట్టవచ్చు.

❀ 85% శాతం గ్రుడ్లు పొదగబడతాయి.

**ముఖ్యాంశాలు :**

❀ పొరపాటున మూత తెరుచుకోవటం లేదా కరెంటు పోయినా వేడి ఎక్కువైనా, తగ్గినా తేమ శాతం పెరిగినా, తగ్గినా అలారం మోగే ఏర్పాటు చేయబడింది.

❀ విద్యుత్ సరఫరా ఆగిపోయినపుడు కిరోసిన్ దీపం కూడా వాడుకునే సదుపాయం వుంది కనుక ప్రత్యేకించి జనరేటర్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం వుండదు.

**వివరాలకు సంప్రదించండి:**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 96528 01700**
E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## సంవత్సరానికి మూడుసార్లు కాసే మామిడి రకం అంటు మొక్కలు

పాఠకులకు మనవి, 'జగదాంబ ఎన్–1, ఎన్–2 రకం మామిడి మొక్కలు సంవత్సరంలో మూడు సార్లు కాయలు కాసే ఈ మొక్కలు కావలసిన వారు క్రింది బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయగలరు. ఒక మొక్క రూ. 600/–లు

పూర్తి వివరాలకు సంప్రదించండి:

సుభాష్ చందర్, మేనేజింగ్ డైరెక్టర్, క్రియేటివ్ మైండ్స్, ఫోన్:96528 01700, 040–27111959

బ్యాంకు అకౌంటు వివరాలు :

Name of the A/c: Creative Minds
A/c No: 510101006285094
IfScode : CORP0000640
Corporation Bank, Sainikpuri Branch



# గత మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు





గుంటూరు జిల్లా బాపట్ల వ్యవసాయ కళాశాలలో 21-24 జూన్, 2019లో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శనలో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ప్రదర్శించినప్పటి చిత్రం.

'ఇంటింటా ఇన్నోవేటర్' పురస్కారాలు



తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రూథ్‌ల చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న విశ్వనాథ రాజు



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న ఇన్నోవేటర్ పాండురంగారావు




'పల్లెసృజన' భావాలను సందర్శకులకు వివరిస్తున్న అశోక్ కుమార్





నిజామాబాద్ జిల్లా ప్రదర్శనలో పాల్గొన్న ఇన్నోవేటర్లు 'తోకల శ్రీదేవి', 'చిన్ని క్రిష్ణ'



తెలంగాణ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్, చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న అల్లాడి ప్రభాకర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 15 ఆగస్టు, 2019 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 'పల్లెసృజన' సహకారంతో ఒక వినూత్న కార్యక్రమానికి నాంది పలికింది. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆ జిల్లాలోని నూతన ఆవిష్కరణలను ప్రదర్శించే ఏర్పాటు చేయటంతో రాష్ట్ర ప్రజానీకం తమ జిల్లాలోని నూతన ఇన్నోవేషన్లను, ముఖ్యంగా పునాది స్థాయి ఇన్నోవేషన్లను ఎంతో ఆసక్తితో తిలకించారు. ఈ సందర్భంగా మొత్తం 33 జిల్లాల్లో 150కి పైగా నూతన ఇన్నోవేషన్లు వెలుగులోకి వచ్చాయి. ఈ కార్యక్రమం మొత్తం 33 జిల్లాలకు చెందిన 'పల్లెసృజన' వాలంటీర్లు స్వచ్ఛందంగా సహకరించడంతో ఎన్నో కొత్త ఇన్నోవేషన్లు గ్రంథస్తం చేయబడ్డాయి. ఇన్నోవేటర్లు కూడా తమ ఆవిష్కరణలు జిల్లా కలెక్టర్ల ఎదుట ప్రదర్శించటంతో తాము ఎంతో ఆనందానికి లోనైనట్లు ఆయా జిల్లాల ఇన్నోవేటర్లు 'పల్లెసృజన'కు తెలియజేశారు. ఇలా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లలో సమాజానికి అవసరమైన అన్నింటికి 'పల్లెసృజన' ప్రాచుర్యం కల్పించే ప్రయత్నం చేస్తుంది. ఇలాంటి ప్రదర్శనల వల్ల మరుగున పడిపోయి వెలుగు చూడని అనేక గ్రామీణ ఆవిష్కరణలు వెలుగు చూసే అవకాశం కలిగింది. 'పల్లెసృజన' ఎన్నో సంవత్సరాలుగా కృషి చేసి పెద్దసంఖ్యలో ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావడం చేస్తున్న నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం పూనుకోవడంతో మరింత ప్రోత్సాహం లభించినట్లైందని అన్నారు 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం.

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి చేయబడిన క్యారెట్ 'దుర్గా-4'

**జాతీయ స్థాయి మూడవ పురస్కారం – మొక్కల విభాగం**

**ఇన్నోవేటర్ : మదన్‌లాల్ దేవ్‌డా, జోద్‌పూర్, రాజస్థాన్.**

రాజస్థాన్ లోని జోద్‌పూర్‌కు చెందిన 50 సంవత్సరాల మదన్‌లాల్ దేవ్‌డా అనే రైతు ఎంపిక చేసే పద్ధతిలో క్యారెట్ రకాన్ని అభివృద్ధి చేశాడు. ఇవి సాధారణ రకంకన్నా ఎక్కువ ఎరుపు రంగు కలిగి వుండి, పొడవుగా వుండి, తియ్యని రుచితో, అధిక విటమిన్లు ఉంటాయి. మొక్క



పొడవు ఆకులు కలిగి వుంటుంది.

పదవ తరగతి వరకు చదువుకున్న మదన్‌లాల్





తనకున్న 10 ఎకరాల పొలంలో క్యారెట్ పండిస్తుంటాడు. అతను అదనంగా మరో 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అందులో క్యారెట్‌తో పాటు, ముల్లంగి, ఆముదము, జీలకర్ర, సజ్జ, గోధుమ పంటలు కూడా పండిస్తూ వుంటాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ళు పెళ్ళిల్లు చేసుకుని స్థిరపడ్డారు. ఇతను ఎక్కువ ప్రమాణంలో క్యారెట్‌ను పండించి రాజస్థాన్ లోని అన్ని ప్రాంతాల్లోనే కాక, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తూ వుంటాడు. ఇంతే కాక మదన్‌లాల్ చుట్టు ప్రక్కల గ్రామాల, జిల్లాల రైతులకి క్యారెట్ విత్తనాలను కూడా సరఫరా చేస్తూ వుంటాడు.

1998లో మదన్‌లాల్ స్థానికంగా ఒక రైతు వద్ద నుండి క్యారెట్ విత్తనాలు కొని పండించగా, వాటిలో కొన్ని మొక్కలు ఏపుగా, ఆరోగ్యంగా ఉండటం గమనించాడు. అటువంటి మొక్కలను ఎంపిక చేసుకొని వాటినుండి విత్తనాలను సేకరించాడు. ఇలా ప్రత్యేకంగా సేకరించిన విత్తనాలను నాటి, అందులో ఉత్తమమైన వాటిని మళ్ళీ ఎంపిక చేసుకుని, వాటిని మళ్ళీ నాటసాగాడు. ఈవిధంగా గత 15-20 సంవత్సరాల నుంచి చేస్తూ, ఉత్తమమైన, ఆరోగ్యకరమైన, అధిక దిగుబడినిచ్చే క్యారెట్ రకాన్ని రూపొందించాడు.

ఈవిధంగా రూపొందించిన క్యారెట్ రకంలో చాలా ప్రత్యేకమైన లక్షణాలున్నాయి. ఇది సుమారు 60 సెంటీమీటర్ల పొడవుండి, ఎర్రటి రంగులో, తియ్యగా వుండి, అధిక విటమిన్లు కలిగి వుండటమే కాక, ఎక్కువ కాలం చెడిపోకుండా నిలువ ఉంటాయి. పొడవుగా వుండే ఈ క్యారెట్ ఆకులను పశువులకి మంచి మేతగా వాడుకోవచ్చు. ఈ 'దుర్గా-4' రకం క్యారెట్‌పై అనేక పరీక్షలు, పరిశోధనలు చేయడం జరిగింది. దేశంలో ఉత్తమమైన క్యారెట్ దిగుబడి హెక్టారుకు 550.8 క్వింటాళ్ళుగా నమోదై వుండగా, ఈ దుర్గా-4 రకం దాదాపు దాంతో సమానంగా 542.5 క్వింటాళ్ళ దిగుబడినిస్తోంది. గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్ ప్రాంతంలో ఎన్.డి.డి.బి (నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు) వారి పరిశోధనాలయంలో జరిపిన ప్రత్యేక పరీక్షలలో ఈ రకం క్యారెట్ చీడపీడలను తట్టుకునే శక్తిని కలిగివుందని, బీటా కెరటిన్ శాతం కిలోకి 72.8 మి.గ్రా. వుందని, ఇనుము శాతం 98.8 మి.గ్రా. వుందని, విటమిన్-ఇ 52.1 శాతం ఉందని నిర్ధారించబడింది. ఇవన్నీ కూడా సాధారణ క్యారెట్ రకాలలో వుండే మోతాదుకన్నా చాలా అధికం. 2016లో జయపూర్‌లోని ఒక పరిశోధనాలయంలో రాజస్థాన్ లాంటి ఎడారి ప్రాంతంలో ఈ రకం క్యారెట్ పండించే సాధ్యాసాధ్యాలపై పరిశోధనలు చేసి, సాధ్యమేనని నిర్ధారించడం జరిగింది. ఆ రాష్ట్రంలోని జోధ్‌పూర్ మరియు పరిసర జిల్లాలలో రైతులు ఈ రకాన్ని విరివిగా పండించి, అధిక దిగుబడులను సాధిస్తున్నారు.

# అభివృద్ధి చేయబడిన 'సోయాబీన్' రకం (పండరినాథ్-1)

**జాతీయ రాష్ట్ర స్థాయి బహుమతి - మొక్కల విభాగం**
**ఇన్నోవేటర్ : కాశీనాథ్ ఎన్. లొకాండే, బేతిల్ జిల్లా, మధ్యప్రదేశ్.**

మధ్యప్రదేశ్ లోని బేతిల్ జిల్లాకి చెందిన 59 సంవత్సరాల కాశీనాథ్ అనే రైతు సంవత్సరానికి రెండు పంటలనిచ్చే 'పండరినాథ్-1 అనే సోయాబీన్ రకాన్ని అభివృద్ధి చేశాడు. ఈ రకంలో ఒకే ప్రమాణం గల గింజలు ఉండటమే కాక, సోయాబీన్ పంటకు సాధారణంగా సోకే 'ఎల్లో మొజాయిక్' అనే చీడని సమర్ధవంతంగా తట్టుకునే శక్తి కలిగి వుంటుంది.

కాశీనాథ్‌కి 5 ఎకరాల పొలం వుంది. అందులో అతను ప్రధానంగా సోయాబీన్, గోధుమలు, శనగలు, నారింజ మొదలైన పంటలు పండిస్తూ వుంటాడు. ఇతను ఎక్కువగా నారింజ వ్యాపారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ వుంటాడు. తాను కేవలం పదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నా, తన ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు మాత్రం ఉన్నత విద్యలు చదువుకునేందుకు ప్రోత్సహించాడు. వ్యవసాయ పనుల్లో ఇతని భార్య చేదోడు వాదోడుగా





వుంటుంది. ప్రస్తుతానికి ఇతను ఉత్తమమైన సోయాబీన్ రకాన్ని అభివృద్ధి చేయటంలో నిమగ్నమై ఉన్నాడు.

సోయాబీన్ రైతుగా ఈయనకి ఆ ప్రాంతంలో మంచి పేరుంది. అసలు వ్యవసాయం మీద మక్కువ ఈయనకి వాళ్ళ పెద్దన్నయ్య కారణంగా కలిగింది. ఆయన సలహాలనే ఈయన ఎక్కువగా పాటిస్తూ వుంటాడు. ట్రక్కు డ్రైవరుగా పని చేసే కాశీనాథ్ ఆయన ప్రోద్బలం వల్లనే వ్యవసాయం చేపట్టాడు. కుటుంబ సభ్యులందరూ ఇతను తన పొలంలో చేసే ప్రయోగాలన్నింటికీ ప్రోత్సాహాన్ని అందిస్తూ వుంటారు. ప్రస్తుతం ఈయన మేనల్లుడు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా వుంటాడు.

సోయాబీన్ పంట భారత దేశంలో నలుమూలలా పండిస్తున్నా, కాశీనాథ్ వుండే పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తూ వుంటారు. 2008 ఖరీఫ్ కాలంలో తాను 'జె.ఎస్.-9752' రకం విత్తాడు. కారణం ఇది ఇతర రకాల కన్నా, 10-12 రోజులు ముందే కాపుకు వస్తుంది. తాను వేసిన పంటలో కొన్ని మొక్కలు మిగతా వాటికన్నా ఆరోగ్యంగా, ఏపుగా వుండటం గమనించి, వాటి విత్తనాలను ప్రత్యేకంగా సేకరించి పెట్టాడు. ఈవిధంగా సేకరించిన 300 గ్రాముల విత్తనాలను ప్రత్యేకంగా ఒకచోట నాటి, దాని నుండి 15 కిలోల



విత్తనాలను తయారు చేసుకున్నాడు. ఇలా క్రమంగా ప్రతి సంవత్సరం చేసి, 2012 నాటికి 75 క్వింటాళ్ళ విత్తనాలను తయారు చేశాడు. అప్పటినుండి ఈ విత్తనాలనే తనూ వాడుతూ, ఇతరులకి కూడా ఇవ్వసాగాడు.

'పండరినాథ్-1' గా నామకరణం చేసిన ఈ రకం సోయాబీన్ విత్తనాలు సంవత్సరానికి రెండు పంటలు ఇస్తూ, 95 రోజుల్లోనే కాపుకు వస్తాయి. ఈ మొక్కలో ఎక్కువ కాయలు రావటమే కాక, గింజలు కూడా పరిమాణంలో పెద్దవిగా వుంటాయి. సోయాబీన్ పంటకు సాధారణంగా సోకే 'ఎల్లో మొజాయిక్' చీడను ఇది సమర్థవంతంగా ఎదుర్కోవటమే కాక, అత్యధికంగా ఎకరాకు 12 నుండి 15 క్వింటాళ్ళ వరకు దిగుబడి ఇస్తుంది. ఈ రకం ప్రత్యేకత ఏమిటంటే, ఇది తక్కువ వర్షపాతమున్న ప్రదేశాల్లో కూడా విత్తుకోవచ్చు. పైగా ఎటువంటి ఎరువులు వాడనవసరం లేదు.

ఈ 'పండరినాథ్-1' రకం సోయా విత్తనాలు విస్తృతంగా మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలలో క్షేత్ర పరిశీలన నిర్వహించడం జరిగింది. పరీక్షలు జరిపిన ప్రతి ప్రదేశంలో చీడపీడలను తట్టుకోవటమే కాక, 95 నుండి 100 రోజుల్లోనే ఇది కాపుకు వస్తుందని నిర్ధారించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల్లో చాలామంది రైతులు ఈ రకం విత్తనాలు వాడి, అధిక దిగుబడిని సాధించి, లాభాలు పొందుతున్నారు. 2015 లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో వర్షాభావం ఏర్పడటంతో ఆ రాష్ట్రాలలో రైతులు వేసిన అన్ని రకాల సోయాబీన్ పంటలు నష్టాలకు గురి కాగా, కేవలం 'పండరినాథ్-1' రకం విత్తిన రైతులు మాత్రమే లాభాలను ఆర్జించారు. ఇలా వరుసగా రెండు సంవత్సరాలు జరిగింది. ఈ రకం సోయాబీన్ అభివృద్ధి చేసినందుకు గాను 'కాశీనాథ్'ను అనేక సంస్థలు సన్మానించటమే కాక, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి పత్రికలలో కూడా ఈయనను గురించి ప్రశంసిస్తూ వ్యాసాలు ప్రచురించడం జరిగింది. ●

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం



ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/-లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

మీ చందాను పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు :
**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**
జమ చేసిన తర్వాత మీ చిరునామాను స్పష్టంగా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
**E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org**




112 రకాల దేశవాళీ వరి విత్తనాలను పండించి, ఒక నూతన వరి వంగడాన్ని రూపొందించిన

# రైతు శాస్త్రవేత్త 'చిన్నిక్రిష్ణుడు'

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ఇది నిజామాబాద్ జిల్లా, జెక్రాన్‌పల్లి మండలం, చింతలూరు గ్రామానికి చెందిన 'చిన్ని క్రిష్ణుడు' అనే 65 సంవత్సరాల రైతు వినూత్న విజయగాథ. పేరులో చిన్ని వున్నా, చాలా పెద్ద పని చేసి నేటి యువ రైతులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఈ కథనాన్ని 'పల్లెసృజన' పాఠకుల కోసం అందిస్తున్నాం.

చిన్నిక్రిష్ణుడు అసలు పేరు 'నాగుల చిన్న గంగారాం'. చిన్నతనంలో తన గ్రామంలో చిన్ని కృష్ణుడు పాటలతో కోలాటాలు ఏర్పాటు చేసినపుడు, అక్కడున్న వారిలో ఇతడు ముద్దుగా బొద్దుగా వుండటంతో 'చిన్ని కృష్ణుడు' వేషం వేయించగా అందులో ఎంతో ఒదిగిపోయి, అందరినీ ఆకట్టుకున్నాడట. అప్పటినుంచి 'చిన్న గంగారాం' పేరు కాస్తా 'చిన్నిక్రిష్ణుడు' గా మారిపోయింది. చిన్ని క్రిష్ణుడుకు భార్య ముగ్గురు మగ సంతానం. ముగ్గరికి వివాహాలు అయిపోయాయి, ఇద్దరు కుమారులు అమెరికాలో 'సాఫ్ట్‌వేర్' ఉద్యోగంలో స్థిరపడగా, మరో అబ్బాయి 'బెంగుళూరు'లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ వున్నాడు. తన స్వగ్రామమైన 'చింతలూరు'లో వున్న తన 11 ఎకరాల పొలాన్ని కౌలుకు ఇచ్చి, తాను ప్రస్తుతం నిజామాబాద్ పట్టణంలో ఉంటున్నాడు. తన కుమారులు మీరీ వయసులో కష్టపడాల్సిన అవసరం ఏముంది అని జిల్లా కేంద్రంలో ఒక భవనం నిర్మించి, ప్రశాంతంగా ఉండమని అన్నారు. చిన్నప్పటినుంచి కష్టపడి పని చేసిన వారికి పట్టణంలో ఖాళీగా వుండాలంటే సాధ్యం కాదు కాబట్టి నిజామాబాద్ పరిసరాల్లో మూడు ఎకరాల పొలం కొని 'మన దేశంలోని దేశీ రకాలైన వరి విత్తనాలను రైతులకు అందించాలన్న తన సంకల్పాన్ని సాకారం చేసుకుంటున్నాడు చిన్నిక్రిష్ణుడు.

ఇతను చిన్నప్పటినుంచి వ్యవసాయంపైనే ఆధారపడిన కుటుంబానికి చెందిన వాడు. గ్రామంలోని చెరువు నుండి యాతం ద్వారా పొలానికి నీరు పారించుకుంటూ భార్యాభర్తలిద్దరూ కష్టపడి పొలం పనులు చేసుకునేవారు. ఎంత కష్టపడి పని చేసినా సరియైన దిగుబడులు రావటం లేదు, వచ్చినా సరియైన ధర లభించడం లేదని నాడు కొత్తగా మండలాలు ఏర్పడినప్పుడు మండల వ్యవసాయాధికారితో తన బాధను వివరించగా, అప్పుడు ఆ అధికారి వ్యవసాయంలో నూతన పోకడలను గురించి వివరించాడట. ఆ విధానంలో మంచి పంటలు పండిస్తూ మొదట వేరుశనగ పండించి అధిక దిగుబడి సాధించాడు. అలా రక రకాల పంటలను పండిస్తూ తన కుమారులను ఉన్నత చదువులు చదివించాడు. అసలు వ్యవసాయమే లాభసాటి కాదు అనుకున్న ఈ రైతు సరియైన



సలహాలు పాటించి, ఆచరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని ఈ విధానాన్ని తోటి రైతులను కూడా ఆచరించమని ప్రోత్సహించాడు. దైవానుగ్రహం వలన మంచిగా వర్షాలు పడితే, నీటి లభ్యత పుష్కలంగా వుండి ఓపికతో వ్యవసాయ పనులు చేసుకుంటే రైతుకు మించినవాడు లోకంలో వుండడని, తాను ఆచరిస్తున్న విధానాలను రైతులకు ఎప్పటికప్పుడు చెబుతూ, రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకునేందుకు ఎంతో కృషి చేశాడు. రైతులను ఉమ్మడిగా జతచేసి, ఎప్పటికెప్పుడు వారిని ఉత్తేజితులను చేస్తూ నిరుత్సాహానికి గురికాకుండా ఎంతో ధైర్యాన్ని అందించాడు. ఎక్కడ రైతులు కనిపిస్తే వారితో తనకు తోచిన, తాను ఆచరించిన లాభసాటి విధానాలను చెప్పేవాడు.

రైతుకు 'భూమాతకున్నంత ఓర్పు ఉండాలి' అంటూ నిరుత్సాహ పడకుండా భవిష్యత్‌పై ఆశతో, నూతన ఒరవడులను అలవర్చుకుంటూ మంచి దిగుబడులు సాధించడమే కాక, తోటి రైతులకు మంచి సలహాలు ఇస్తాడన్న పేరు తెచ్చుకున్నాడు. ఇలా 2005వ సంవత్సరం వరకు ఎంతోమంది రైతుల మన్ననలు పొందాడు. ఆ తర్వాత అతను చాలామంది ప్రజలు అనారోగ్యాల పాలు ఎందుకు అవుతున్నారు కొత్త కోణంలో ఆలోచించాడు. ముఖ్యంగా రైతులు తాము పండించి పొందిన లాభాలను ఆసుపత్రులకు (దవాఖానాలకు) అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. టెక్నాలజీ పెరిగే కొద్దీ అనారోగ్యాలు ఎందుకు ఎక్కువవుతున్నాయి అని ఆలోచిస్తూ వుండగా, 2007లోతాను 7 రోజుల పాటు 'యోగా శిక్షణ' తరగతులకు హాజరైనప్పుడు సమాధానం దొరికింది. అక్కడ యోగా గురువులు చెప్పిన మాటలు "రైతులు పంటలపై ప్రమాదకరమైన రసాయన క్రిమి సంహారకాలు ఉపయోగించి పంటలు పండిస్తున్నారని, వాటివల్లనే నానాటికీ ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని, అంతుచిక్కని రోగాల బారిన పడుతున్నారని" చెప్పిన వారి మాటలతో జ్ఞానోదయమై అప్పటినుండి సేంద్రియ పద్ధతిలో వరి పండించి, వాటిని మిల్లులో బియ్యంగా మార్చకుండా దంపుడు వడ్లు చేసుకుని, ముడి బియ్యంను అన్నంగా చేసుకుని తింటే ఆరోగ్యం విషయంలో ఎంతో తేడా వచ్చిందని గ్రహించాడు చిన్నిక్రిష్ణుడు.

మొదట బిపిటి వరి రకాన్ని పండించాడు. ఆ తర్వాత ఈ హైబ్రీడ్ వరికన్నా పాత కాలంనాటి దేశీయ రకాల వరిని పండిస్తే అందులో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలుసుకుని, నాడు 'నవార' అనే వరి రకాన్ని సేకరించి పండించాడు. తాను అనుకున్న విధంగా ఆ బియ్యంతో చేసిన అన్నం వలన ఆరోగ్యంలో చాలా మెరుగు ఉందని గమనించాడు. అప్పుడు అర్థమైంది ఆయనకు హైబ్రిడ్ విత్తనాలకన్నా మన దేశీయ విత్తనాలే ఎన్నో రకాలుగా పోషకాలను కలిగి వున్నాయి, ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి అని.

తాను తెలుసుకున్న ఈ ఆరోగ్య సూత్రం వలన తనకే కాక, సామాన్య జనులందరికి కూడా మేలు జరగాలి అన్న సంకల్పంతో, అదే ఒక ఉద్యమంగా చేసుకుని, దేశీ రకాల వడ్లను సేకరించడం మొదలు పెట్టాడు. దేశంలోని ఎన్నో ప్రాంతాలు, రాష్ట్రాల నుండి దాదాపు 110 రకాల వడ్లను సేకరించి తన మూడెకరాల పొలంలో ఒక్కో రకానికి కొన్ని గుంటల భూమిని కేటాయించి, విత్తనం మాత్రమే తయారు చేసి తోటి రైతులకు అందించటం మొదలు పెట్టాడు. గత సంవత్సరం కూడా 50 రకాల వరి విత్తనాలను వివిధ ప్రాంతాల రైతులకు సరఫరా చేయడం జరిగింది. ఈ సంవత్సరం ఇప్పటికే 60 రకాల వరి పంటను వేయటం జరిగింది.

తనకున్న పరిజ్ఞానంతో జపాన్ వారి ఆలోచనా విధానం చిన్నిక్రిష్ణకు ఎంతగానో నచ్చింది. ఆ దేశస్తులు ఏ పని చేసినా, వ్యవసాయం చేసినా, కర్మాగారాల్లో పని చేసినా, ఏదైనా సరే ఎంతో సంతృప్తిగా చేస్తారని తెలుసుకున్నాడు. ఆ విధానాన్నే తానూ ఆచరించడం మొదలు పెట్టాడు.





చాలామంది అనుకుంటారు..... ఇన్ని రకాల వడ్లను నూర్పిడి చేసి, వాటిని వేర్వేరుగా నిలువ చేసి తోటి రైతులకు అందించటమెలా అని. దానికి చిన్నిక్రిష్ణ చిరునవ్వుతో ఏ పని చేయాలనుకున్నా సంతృప్తితో ఇష్టపడి చేస్తే అన్ని పనులు సక్రమంగానే జరిగిపోతాయి అంటాడు. జపాన్ దేశస్తులు వ్యవసాయం చేసుకునేటప్పుడు కూడా ఎన్నో విన్యాసాలు చేస్తూ వుంటారు. అంటే తాము పండించే పంట అందరు రైతుల్లా గొర్రుతో విత్తి, పండించి, నూర్పిడి చేసే మామూలు ప్రక్రియలా కాకుండా, ఆ పంటలో తమకు నచ్చిన దైవం ఫొటో వచ్చేలానో, ఏదైనా తమకు నచ్చిన ఆకారం వచ్చేలాగానో పంటలు విత్తుతూ వుంటారట. అప్పుడు ఆ పంట పెరిగే కొద్దీ తమ కలల ఆకారం పెరుగుతూ వస్తుంటే వారికి ఎంతో ఆనందం కలిగి, ఆ పంటపైన ఇంకా ఎక్కువ శ్రద్ధ పెట్టి పండిస్తారట.

ఆ విధానాన్ని చిన్నిక్రిష్ణ ఆదర్శంగా తీసుకుని, సూర్య మండలం వచ్చేలా 49 రకాల వరి నారుమళ్ళను ఏర్పాటు చేసి, నారును పోశాడు. మరోచోట చంద్రమండలం ఆకారంలో 11 రకాల వరి విత్తనాలను నారుగా పోశాడు. అంటే ఈ సంవత్సరం మొత్తం 60 రకాల వరి విత్తనాలను దేశానికి అందించబోతున్నాడు. తాను గతంలోనే పండించిన వరి వంగడమే కాబట్టి ఏ వరి రకం ఏ రంగులో వుంటుంది, ఆ రంగు పంట ఎక్కడ వేస్తే బాగా అందంగా కనబడుతుంది అని ఆలోచించి నారు పోశాడు. అంతే కాదు, ప్రకృతి వ్యవసాయం విధానాలు ఇతర రైతులకు పంటను చూస్తేనే స్ఫురించే రీతిలో వరి నాటించాలి అనుకుంటున్నాడు.

ఈ 60 రకాల వరి పంటను ఆ రకం యొక్క వినియోగం, రైతుల అవసరాన్ని బట్టి ఒక గుంట, రెండు గుంటలు ఇలా మొత్తం 3 ఎకరాల్లో 60 రకాల వరి ధాన్యం పండించి, విత్తనం కావాలనుకున్న రైతుకు అందజేస్తాడు. ఎవరైనా రైతులు మేమూ ఈ విత్తనాన్ని తయారు చేసుకుంటాము అంటే కొద్దిగా విత్తనాన్ని ఉచితంగానే ఇస్తాడు. అలా చేసుకోలేని రైతులకు కొద్దిగా పెద్ద మొత్తంలో విత్తనం కావాలంటే ఖరీదుకు ఇస్తాడు చిన్నిక్రిష్ణుడు.

ఈ విధంగా ఇప్పటికే చాలామంది రైతులు తనవద్ద విత్తనం తీసుకువెళ్ళి వారు దాన్ని తయారు చేసుకుని పెద్దమొత్తంలో పంటలు పండిస్తున్నారు. ఆ ఆహారం తిన్న రైతులు ఈయనకు ఫోన్ చేసి కృతజ్ఞతలు చెపుతుంటే చాలా ఆనందంగా ఉంటుంది అంటారాయన. తాను చెప్పిన విధంగా పంటలు పండించడం వల్ల ప్రజల ఆరోగ్యం బాగుపడుతోంది, పశువులకు కూడా మంచి గడ్డి లభించడంతో అవి కూడా ఆరోగ్యంగా ఉంటున్నాయన్న ఆనందం చాలు నాకు అంటారు. వారు వ్యక్తం చేస్తున్న ఆనందాన్ని చూసి ఇంకా కష్టపడాలి అనిపిస్తుందని సంతోషం వ్యక్తం చేశాడు చిన్నిక్రిష్ణుడు.

చిన్నిక్రిష్ణుడు ఇప్పటి వరకు భారత దేశం అంతటా తిరిగి సేకరించిన నాణ్యమైన దేశీ విత్తనాలు తనవద్ద 102 రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం మరో పది కొత్త రకం దేశీ విత్తనాలను పండిస్తున్నాను అన్నారు.

ఇలా సాగు చేస్తున్న క్రమంలో 2009వ సంవత్సరంలో ఒక పంటలో కొన్ని బెరుకులు (మామూలు పంటకన్నా ప్రత్యేకంగా కనిపించే వరి మొక్కలను బెరుకులు అంటారు) వచ్చాయి. ఇవి ఎందుకిలా వున్నాయని పరిశీలించి చూడగా వాటి బియ్యం కూడా సన్నగా, నాణ్యంగానే కనిపించింది. సాధారణంగా ఏ రైతైనా పంటలో ప్రత్యేకంగా కనిపించే బెరుకు విత్తనాల మొక్కలను పీకివేస్తాడు. ఎందుకంటే వాటివల్ల విత్తనంలో కల్తీ వుంటుందని, పంటకు మార్కెట్‌లో ధర లభించదని అలా చేస్తారు. కానీ, చిన్ని క్రిష్ణుడు మాత్రం ఆ బెరుకు మొక్కలను పీకివేయకుండా వాటిని కూడా పండేదాక వేచియుండి వాటి కంకులను ప్రత్యేకంగా సేకరించి, ఆ విత్తనాలను మరోచోట నాటి, మళ్ళీ వాటిలో వచ్చిన బెరుకులను వేరుగా సేకరించడం ఇలా 5 సంవత్సరాల తర్వాత









ఒక మంచి రకం వరి ధాన్యాన్ని రూపొందించాడు. ఆ ధాన్యాన్ని హైదరాబాద్‌లోని ఒక వ్యవసాయ అధికారికి అందించగా ఆయన 'చింతలూరు సన్నాలు' అనే పేరుతో వాటిని దేశమంతటా పంపించి క్రొత్త వంగడంగా రూపుదిద్దాడు. అవి ఇప్పటికీ ఎన్నోచోట్ల అదే పేరుతో పండించ బడుతున్నాయి. ఆ వ్యవసాయ అధికారి ఈయన ఊరి పేరుమీదనే వంగడానికి ఆ నామకరణం చేశారు. ప్రస్తుతం ఆంధ్ర, కోస్తా ప్రాంతాల్లో వరి విత్తనాలు అమ్మే దుకాణాల్లో బోర్డుపై 'చింతలూరు సన్నాలు' అన్న పేరు ఈమధ్యనే టీవీలో చూసి ఆశ్చర్యపోయాను అంటున్నాడు. అంటే తనకు తెలియకుండానే తన ఊరి పేరుమీద తన విత్తనం దేశమంతటా అభివృద్ధి చెందింది. ఇంతకంటే రైతుకు ఆనందం ఏమి కావాలి? అంటాడు చిన్నిక్రిష్ణుడు. ఇప్పుడు అదే విత్తనాన్ని తన పేరున "చిన్నిక్రిష్ణ" వంగడం పేరున పేటెంటుకు దరఖాస్తు చేసుకున్నాడు.

చిన్నప్పటి నుంచి పసుపు, వేరుశనగ, ఉల్లిగడ్డ, వెల్లుల్లి, అల్లం, మిర్చి, ధనియాలు, ఆవాలు తదితర పంటలను పండించేవాడు. ప్రత్తి, పొగాకు తప్ప మిగతా పంటలన్నీ దాదాపు పండించానని, ప్రస్తుతం వరిపైన మాత్రమే శ్రద్ధ పెట్టి సమాజానికి ఆరోగ్యకరమైన దేశీ విత్తన ఆహారం అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని అంటారు చిన్నిక్రిష్ణుడు. ప్రస్తుతం మా ఆర్మూరు ప్రాంతంలో రైతాంగం ఎలాంటి నష్టాలు చవిచూడకుండా పంటలు పండించుకుని ఆరోగ్యకరమైన ఆహారం అందించేలా తనవంతు కృషి చేస్తున్నాడు.



తాను అప్పట్లో పసుపు పంటపై ఎన్నో ప్రయోగాలు చేసి ఒక నూతన వంగడాన్ని రూపొందించి, మంచి దిగుబడులు సాధించి, తోటి రైతులతో కూడా ఆ పద్ధతిలో పండించి, ఎక్కువ దిగుబడి సాధించేలా చేసినందుకు తన కృషికి మెచ్చి మొట్టమొదటిసారి కోట్ల విజయ భాస్కర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఆర్మూర్ ప్రాంతం వచ్చినపుడు ఆయన చేతుల మీదుగా ఆదర్శ రైతు పురస్కారం అందుకోవడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఆ తర్వాత ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు వివిధ పురస్కారాలతో తనను సత్కరించారన్నారు. ఎన్ని సత్కారాలు తీసుకున్నా, రైతాంగానికి అవసరమైన దేశీ విత్తనాలను అందించడంలోనే తనకెంతో తృప్తి వుందని అంటారు చిన్నిక్రిష్ణుడు.

ఒక తరం రైతాంగం విపరీతమైన రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు ఉపయోగించి జాతి మొత్తం నిర్వీర్యం అయ్యేలా చేసిందని, ఆ ఫలితాలు ఇప్పుడు ప్రత్యక్షంగా ప్రజల అనారోగ్యం రీతిలో సాక్షాత్కారం అవుతున్నాయన్నారు. నేటి యువ రైతులు ఈ విషయాన్ని వివరంగా గ్రహించి, ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను పండించి సమాజానికి అందించాలని, ముఖ్యంగా రైతు నష్టపోకుండా మిశ్రమ పంటలపై దృష్టి సారిస్తే ఒక్కోసారి ఒక పంటలో నష్టం వచ్చినా మరో పంట ఆ నష్టాన్ని తీరుస్తుందని, యువ రైతులు ఆవిధంగా మంచి పంటలు వేసి, అధిక దిగుబడులు సాధించాలని, ఒక్క రైతు మాత్రమే సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచగలడని సూచించారు చిన్నిక్రిష్ణుడు.


సమాజం ఆరోగ్యాన్ని పరిరక్షించే బాధ్యత కేవలం వైద్యులదే కాదని, వారు కూడా అనారోగ్యం పాలైన తర్వాతనే పరిష్కారాలు చూపించ గలుగుతారని, అసలు సమాజంలోని మనుషులు అనారోగ్యం పాలు కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం అందించ గలిగిన నాడే రైతు కూడా వైద్యుని మించిన వైద్యుడు అనిపించుకుంటాడని తాను నమ్ముతున్నానని, అదేమాట నలుగురికి చెబుతున్నాని అంటాడు చిన్నిక్రిష్ణుడు.

**ఇన్నోవేటర్ చిన్నిక్రిష్ణుడు ఫోన్ : 9866423439**

# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలీఫ్లవర్' పంటల అదికోత్పత్తి :**

ఒరిస్సాలోని సుందర్‌ఘర్ ప్రాంతం లోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజీ పంటల అధికోత్పత్తికి ఈ



పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి మారాకులు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తుంది. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత ఐదు సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి అధికోత్పత్తిని సాధించాడు.

**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం :**

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చుర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను దంచి ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా చేరనివ్వకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కన్పిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా



పశువులకు ఉపశమనం కలిగించాడు.

**నిమ్మజాతికి చెందిన దబ్బ(కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**

ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (49 సం.) ఈ చెట్ల ఆకులను



పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్‌ను తయారు చేసి పశువులకు తాగిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.

**పత్తి, కూరగాయల పంటలలో చీడల నివారణకు**



పత్తి, ఏ కూరగాయల పంటలలోనైనా చీడ పట్టకుండా తాను చాలా సులువైన పద్ధతిని వాడుతున్నానని గుజరాత్ రాష్ట్రంలోని జూనాఘడ్ జిల్లా, మాల్యా తాలూకా నివాసి గీతాబెన్ కాంతిలాల్ సోలంకి చెప్తున్నారు. ఈమె తేలుకొండి కాయ ఆకులు, వేర్లను సేకరించి, నీడలో బాగా ఆరనిచ్చి, వాటిని పొడిచేసి, నీటిలో కలిపి ప్రత్తి పంట, కూరగాయల పంటలపై పిచికారి చేస్తుందట. తాను 10 మీటర్ల చదరం గల పంటకి 500 గ్రా. పొడిని వాడుతానని చెపుతున్నారు. ఈ పద్ధతి వాడటం ప్రారంభించిన తర్వాత తన పత్తి, కూరగాయల పంటలలో చీడ పట్టడం బాగా తగ్గిపోయిందని చెపుతున్నారీమె.


**పొలంలో ఎలుకల నివారణకు మూలికలతో మందు**

పొలాల్లో ప్రత్యేకించి ధాన్యం పండించే పొలాల్లో ఎలుకల బెడద ఎక్కువ. అవి పంటకు చాలా నష్టం కలుగజేస్తుంటాయి. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లా, ఉమర్‌పాడ తాలూకా నివాసి 'కన్సర్‌భాయ్ గజలాభాయ్ చౌదరి' తాను ఎలుకల బాధనుండి తప్పించుకోవటానికి మూలికలు వాడుతా నని చెపుతూ తన పద్ధతిని ఈవిధంగా వివరించారు. ఆయన గచ్చకాయ గింజలు, ఇప్ప విత్తనాలు, జొన్న లు కలిపి పొడిచేసి, తగినంత నీటిని చేర్చి చిన్న చిన్న గులికలు గా తయారు చేస్తానని, ఈ గులికలను ఎలుక బొర్రలలో ఉంచుతానని, ఈ గులికల వాసన, రుచి నచ్చక ఎలుకలు పారిపోతాయని, తానీ పద్ధతి చాలా సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.



**ధాన్యం నిలువకి బిరియాని ఆకు:**

బీహార్ రాష్ట్రంలోని బక్సద్ జిల్లా, మొహల్లా సోనయ్‌పట్టి ప్రాంత నివాసి 'మురళీ శరణ్ సింఘ' ధాన్యం నిలువకి బిర్యాని ఆకు వాడుతానని చెప్తున్నారు. పప్పులు, ధాన్యం నిలువ చేయటానికి ముందు వెదురు గుమ్మిలో క్రింద బిర్యాని ఆకులు వేసి, వాటిపై ధాన్యాన్ని పోసి మళ్ళీ ఒకసారి మధ్యలో ఆకులు వేసి, ఆపైన మళ్ళీ ధాన్యం వేసి, పై భాగంలో మళ్ళీ బిర్యాని ఆకులు పరిచి నిలువ చేస్తే ధాన్యాన్ని 7 నుండి 8 నెలల వరకు సురక్షితంగా కాపాడుకోవచ్చు అని చెపుతున్నారీయన. ఈ పద్ధతిలో ప్రత్యేకత ఏమిటంటే బిర్యాని ఆకు (తేజ్ పత్తా)ని వంటలో వాడిన తర్వాత కూడా శుభ్రం చేసి ఎండబెట్టి ధాన్యం నిలువ చేయటానికి వాడుకోవచ్చు. చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగి పోతుందట. ఈ ద్రావకం బూజు తెగులు కు కూడా బాగా పని చేస్తుంది అంటారు లఖాత్రియా.



### 'పల్లెసృజన' కృషితో తానా, తెలంగాణ ప్రభుత్వం, చింతకింది మల్లేశంల మధ్య

# '1000 ఆసు యంత్రాల వితరణ' అవగాహనా ఒప్పందం

పోచంపల్లి చేనేతలో 'ఆసు' పోయడం అనేది ప్రధాన సమస్య. ఈ ఆసు పోయడాన్ని కేవలం మహిళలు మాత్రమే చేయడం ఇంతవరకు జరుగుతున్న విషయం 'పల్లెసృజన' పాఠకులకు విదితమే. ఒక్క చీరకు ఆసు పోయాలంటే ఒక మహిళ కనీసం 9 వేలసార్లు తన ఎడమ చేతిని అటూ ఇటూ తిప్పాల్సి వుండటం వల్ల వారికి ఎన్నో ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం వుంది. ఇటువంటి ప్రధాన సమస్యను రూపు మాపేందుకు 2001లో తన తల్లిని ఈ బాధనుండి విముక్తురాలిని చేసేందుకు చింతకింది మల్లేశం తన తల్లి పేరుననే 'లక్ష్మీ ఆసు యంత్రం' రూపొందించాడు. ఈ యంత్రం తయారు చేసి 18 సంవత్సరాలైనా ఇంకా కొంతమంది చేనేత కుటుంబాలకు చెందిన మహిళలు ఇప్పటికీ చేతితోనే ఆసు పోస్తునే వున్నారు. దీనికి కారణం ఆ చేనేత కుటుంబాల వారు ఈ యంత్రాన్ని కొనేంతటి ఆర్థిక స్థోమత లేకపోవడమే.

అటువంటి వారికి సహాయం అందించటానికి ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు, చేనేత సంఘాలు ఇప్పటికే కొన్ని ఆసు యంత్రాలను 'పల్లెసృజన' ద్వారా 'ఆసు కుటుంబం' పేరుతో కొన్ని యంత్రాలను సమకూర్చడం జరిగింది. అయినా ఇంకా తెలంగాణ రాష్ట్రంలో వెయ్యికి పైగా చేనేత కుటుంబాలకు దీన్ని సమకూర్చాల్సిన అవసరమున్నది. ఈ సమస్య నివారణకు పల్లెసృజన గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి సహాయం అందించడానికి కృషి చేస్తూనే వున్నది. అయినా ఏవో ఆటంకాలు ఎదురవటంతో అది సాధ్యం కాలేదు. ఈ కృషిలో భాగంగా 'నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా)' వారితో 'పల్లెసృజన' జరిపిన చర్చల ఫలితంగా వారు వెయ్యి ఆసు యంత్రాలకు ఆర్థిక సహకారం అందించేందుకు ముందు వచ్చారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ 'జయేష్ రంజన్' గారితో సంప్రదించి, మీరు సహకరిస్తే ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందామని బ్రిగేడియర్ గణేశం గారు కోరడం జరిగింది.



ఈ ఒప్పందం ప్రకారం ఆసు యంత్రం ఖరీదులో సగం ఖర్చును 'తానా' భరిస్తుంది, మిగిలిన సగ భాగంలో 25 శాతం ప్రభుత్వం అందిస్తే, మిగతా 25 శాతం ఖర్చును లబ్దిదారుడు భరించాల్సి వుంటుంది. ఈ విషయాన్ని జయేష్ రంజన్ గారితో విన్నవించగా, వారు వెంటనే స్పందించి 7 ఆగస్టు, 2019 'చేనేత దినోత్సవం' రోజున "తానా, తెలంగాణ ప్రభుత్వం, ఆసుయంత్రం సృష్టికర్త చింతకింది మల్లేశం" లు 'పల్లెసృజన' ఆధ్వర్యంలో 'యం.ఓ.యు." కుదుర్చుకోవడం జరిగింది.

ఈ ఒప్పందం ప్రకారం 2020 సంవత్సరం ముగిసేలోగా ఈ 1000 ఆసు యంత్రాల వితరణ జరిగిపోవాలని నిర్ణయం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రతి మూడు మాసాలకు ఒకసారి 165 ఆసు యంత్రాల సగం శాతం సొమ్మును 'తానా' వారు చింతకింది మల్లేశంకు చెల్లించాలి. ఆ తర్వాత మల్లేశం ఈ ఆసు యంత్రాలను తయారు చేసి లబ్దిదారుల నుండి 25 శాతం సొమ్ముకు వీటిని అందించాలి. ఈ రెండు కార్యక్రమాల అనంతరం ఆ వితరణ పత్రాలను ప్రభుత్వానికి అందిస్తే వారు మిగతా 25 శాతం సొమ్మును చెల్లిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం చింతకింది మల్లేశం ప్రతి నెలా 50 యంత్రాలకు పైగా తయారు చేసి చేనేత కార్మికులకు అందించాల్సి వుంటుంది.

ఈ ఆసు యంత్రాల లబ్దిదారులను మల్లేశం సహకారంతో 'పల్లెసృజన' వాలంటీర్ల బృందం ఇప్పటికే 500 మందిని ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మొదటి విడత సొమ్మును 'తానా' వారు 1 సెప్టెంబర్, 2019న చింతకింది మల్లేశంకు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం మొత్తంలో 'పల్లెసృజన' వెనక వుండి ఎటువంటి ఆటంకాలు లేకుండా ఏర్పాటు చేయడంతో అటు పోచంపల్లి చేనేత కార్మికులు, ఇటు ఇన్నోవేటర్ చింతకింది మల్లేశంలు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఇంతటి బృహత్తర కార్యక్రమం నిర్విఘ్నంగా జరగడం 'పల్లెసృజన' కీర్తి కిరీటంలో కలికితురాయిగా మారిపోయింది. ఈ ఆనందం మొత్తం 'పల్లెసృజన' వాలంటీర్ల సహకారంతోనే జరిగిందని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు బ్రిగేడియర్ గణేశం.

# జ్ఞానయజ్ఞం
## పల్లె జ్ఞానాన్ని మీ గ్రామాలకూ అందించండి

**"నలుగురికి మేలు చేయండి, మీకూ మేలు జరుగుతుంది" అని పెద్దలు చెపుతూ వుంటారు. నలుగురికీ పనికివచ్చే పని చేస్తే వారికి మేలేమో కాని, ఎంత సంతృప్తి మనకు మిగులుతుందో చేసిన వారికే తెలుస్తుంది.**

ఇప్పుడు 'పల్లెసృజన' నలుగురికి కాదు, నలభై మందికీ కాదు, నాలుగు వందల మందికి మేలు చేసే మార్గం, అవకాశం మీకు కల్పిస్తోంది. పర్వదినాలకి, పుట్టిన రోజులకి, వివాహాలకి మమ్మల్ని గుర్తుంచుకోండి అని ఏదో ఒక బహుమానం ఇవ్వటం మన ఆచారం. అదే బహుమానం ఇచ్చిన వారికే కాక, సమాజానికి కూడా ఉపయోగ పడితే, ఆ ఆనందం మనకు ద్విగుణీకృత మవుతుంది. ఆ తృప్తికి మనకు అవధులు వుండవు.

మేము కోరేదల్లా మీరు పుట్టినరోజులు, వివాహ దినోత్సవాలు లాంటి పర్వదినాల్లో మీ మిత్రులకి మీ పేరుమీద వారికి పల్లెసృజన సభ్యత్వం కల్పించండి. ఇంకొంచెం కొత్తగా ఆలోచిస్తే....! మీరు పల్లెసృజన సభ్యత్వాన్ని మీ గ్రామ పంచాయితీ పేరున ఇవ్వండి!! మీ మిత్రుల సొంత ఊర్లలోని గ్రామ పంచాయితీల పేరున ఇవ్వమని వారిని కూడా ప్రోత్సహించండి!!! మీ కారణంగా అక్కడి ప్రజలు ఎంతోమంది గ్రామీణ ఇన్నోవేషన్లను గురించి తెలుసుకుంటారు. మీ మరియు మీ మిత్రుల గ్రామాలను జ్ఞానంతో కనెక్ట్ చేసినవారవుతారు. అప్పుడు మీకు కలిగే తృప్తిని గురించి ఆలోచించండి. మీరు చేసిన ఈ చిన్న ఖర్చుకి మీకెంత ఫలితం వచ్చిందో మీకే తెలుస్తుంది. ఒక గ్రామానికి కేవలం రూ. 1,000ల సభ్యత్వం చెల్లిస్తే 5 సంవత్సరాల పాటు వారికి కొత్తరకం జ్ఞానాన్ని, మీ గ్రామంలో ఎవరైనా ఇలాంటి ఇన్నోవేటర్లు వుంటే వారికి ఉజ్వల భవిష్యత్తును అందించిన వారవుతారు. ఒక్కసారి ఆలోచించరా దయచేసి. చందా వివరాలు ఈ సంచిక వెనక పేజీలో ఇవ్వబడ్డాయి.

ఈ కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయండి, మన గ్రామీణ ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి, దేశాభ్యుదయానికి తోడ్పడండి. మన తెలుగు రాష్ట్రాల్లోని 30 వేల గ్రామాలను 'పల్లెజ్ఞానం' తో అనుసంధానం (కనెక్ట్)చేయండి. ఇలా చేయటం వల్ల మన స్వదేశీ ఇన్నోవేషన్లు, రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు విరివిగా ప్రచారంలోకి వచ్చి, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు మీరూ సహకరించిన వారవుతారు. సభ్యత్వ వివరాలు ఈ సంచిక వెనక కవర్ పేజీపైన ముద్రించబడినవి.

**- ఎడిటర్.**



## ఉమామహేశ్వర రావు ఆయుర్వేద జ్ఞాన మధనం

# మునగ ఆకు, వెలగ పండు లతో ఆరోగ్యం

**ఆరోగ్యానికి మునగ ఆకుతో వైద్యం :**

వాతం వ్యాధులు, వీర్యపుష్టి, ఆకలి బాగా వేయటానికి మునగలో ఎన్నో వైద్య విలువలు వున్నాయి. మునగలో క్యాల్షియం శాతం ఎక్కువగా వుంటుంది కాబట్టి వీలైనంత వరకు లేత ఆకులు, లేత కాయలతోనే ఆహార పదార్థాలను నేరుగా కాకుండా ఏదైనా ఇతర ఆకు కూరలతో కలిపి చేసుకున్నట్లయితే మనిషి శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. అంటే మునగ ఆకు లేదా కాయలను తమోట, గోంగూర, లేదా ఇతర వేటితోనైనా సరే కలిపి తీసుకోవటం మంచిది. మునగ ఆకుతో చెట్ని చేసుకున్నా పోషక విలువలు నశించవు.

**జీర్ణ శక్తి పెరగటానికి :**

లేత మునగ ఆకులను సేకరించి, కూర వండుకుని తింటే జీర్ణ శక్తి బాగా పెరుగుతుంది. విరోచనం సాఫీగా జరుగుతుంది, శరీరంలో క్యాల్షియం తక్కువ వున్నవారు ఈ కూరను ఆహారంలో ఎక్కువగా తీసుకుంటే క్యాల్షియం లోపం నివారణ జరుగుతుంది. అయితే లేత మునగాకు, లేత కాడలనే కూరలో ఉపయోగిస్తే మంచిది. ముదురు ఆకులలో క్యాల్షియం అధికంగా వుంటుంది. లేత ఆకులలో మనిషికి కావాల్సినంత క్యాల్షియం మాత్రమే వుంటుంది కాబట్టి వీటితోనే కూర వండుకుని తింటే మంచిది.



**ఊబ కాయం గల వారికి మునగతో వైద్యం :**

కొంతమంది వంట్లో నీరు ఎక్కువగా వుండి, లావుగా, వదులైన శరీరంతో వున్నవారు వుంటారు. అటువంటివారు లేత మునగ ఆకులను ఆహారంలో పప్పు లేదా కూరగా చేసుకుని తీసుకుంటే శరీరంలోని నీటిని క్రమంగా తగ్గిస్తుంది. తద్వారా ఊబ కాయం తగ్గుతుంది.

**పిల్లల్లో అజీర్తి నివారణకు మునగ :**

చిన్న పిల్లలలో అజీర్తి వ్యాధి సర్వ సాధారణంగా వుంటుంది. కొంతమంది పిల్లలు ఆహారం సరిగ్గా తీసుకోరు. దానికి కారణం వారిలో అజీర్తి వ్యాధి ఎక్కువగా వుండటమే. కొందరికి విరోచనం సరిగ్గా జరగదు లేదా రోజుకు నాలుగైదు పర్యాయాలు విరోచనాలు అయ్యేవారు కూడా వుంటారు. దీని నివారణకు లేత మునగ ఆకును రసం చేసుకుని అందులో కొద్దిగా సైంధవ లవణం కలిపి మరీ చిన్న పిల్లలయితే రెండు లేదా మూడు చుక్కలు ప్రతిరోజూ ఇవ్వాలి. కాస్త పెద్ద పిల్లలయితే ఒక చెంచాడు రసం సేవిస్తే అజీర్తి వ్యాధినుండి ఉపశమనం లభిస్తుంది.

**వాతపు జబ్బులకు మునగతో మందు :**

కొందరికి వాతపు నొప్పులు విపరీతంగా బాధిస్తూ వుంటాయి. అటువంటి వారు మునగ చెట్టు వేర్లను రసం చేసుకుని, కొద్దిగా తేనెతో కలిపి తీసుకున్నట్లయితే వాతపు నొప్పులు త్వరగా తగ్గిపోతాయి. మనం తినే దాదాపు అన్ని ఆహార పదార్థాల్లో వాత గుణం వుంటుంది. అటువంటి వాతాన్ని ఈ మునగ వేర్ల రసం చాలావరకు తగ్గిస్తుంది.

శుక్ర సంబంధిత వ్యాధులకు కూడా తేనెతో కూడిన మునగ వేర్ల రసం బాగా పని చేస్తుంది. కొంతమందికి వీర్యం పలుచ బడటం, వీర్య స్కలనం జరగటం, వీర్యం గట్టి పడటం లాంటి జబ్బుల నుండి త్వరగా ఉపశమనం పొందవచ్చు. ఈ జబ్బు వున్నవారు మునగ ఆకు, బెల్లం, నెయ్యి కలుపుకుని రోజూ కొంత తీసుకున్నా ఈ దోషాల నుండి నివారణ పొందవచ్చు.

**మునగ జిగురుతో వైద్యం :**

మునగ చెట్టు కాండంపై గొడ్డలితో గాటు పెట్టినట్లయితే కొన్ని రోజుల్లో ఆ ప్రాంతంలో జిగురు వస్తుంది. తలనొప్పి, కముకు దెబ్బలు తగిలిన వారు, అంటే వారికి నెప్పి వుంటుంది కాని ఎక్కడా దెబ్బ కనపడదు. కండరాలలో దెబ్బ తగలడం వల్ల వారు నెప్పితో బాధ పడుతుంటారు. అటువంటి వారు నొప్పి వున్న ప్రాంతంలో మునగ జిగురు పూసినట్లయితే ఆ బాధల నుండి ఉపశమనం పొందవచ్చు.

**పిప్పి పళ్ళకు మునగతో వైద్యం :**

పిప్పి పళ్ళు వున్నవారు ఆ నొప్పితో విపరీతమైన బాధను అనుభవిస్తూ వుంటారు. అటువంటి వారు మునగ వేరును తీసుకుని పిప్పి పంటి నొప్పి వున్నచోట వేరు రసాన్ని తగిలించినట్లయితే త్వరగా నొప్పి నుండి నివారణ పొందవచ్చు.

**మధుమేహం (షుగర్) నియంత్రణకు మునగ :**

మధుమేహం వ్యాధి వున్నవారు లేత మునగ ఆకులను సేకరించి, నీడలో ఆరబెట్టుకొని వాటిని పొడిగా చేసి వుంచుకోవాలి. ఈ పొడిని రోజూ ఒక స్పూను నీటిలో లేదా ఏదైనా తేనీటిగా చేసుకుని తీసుకున్నట్లయితే మధుమేహం నియంత్రణలో వుంటుంది. ఇది రోజూ తీసుకున్నట్లయితే రక్తం గట్టిపడకుండా పలుచగా మారి, రక్తంలోని గ్లూకోజ్ శాతాన్ని తగ్గిస్తుంది.

**చెవి సంబంధిత రోగాల నివారణకు మునగ :**

మునగ ఆకు రసాన్ని తీసుకుని అందులో కొంచెం కొబ్బరినూనె లేదా నువ్వుల నూనెలో కలిపి వేడి చేసి, చల్లారిన తర్వాత చెవిలో రెండు లేదా మూడు చుక్కలు వేసుకున్నట్లయితే చెవిపోటు, చెవిలో చీము కారటం, వినికిడి దోషాల నుండి త్వరగా విముక్తి పొందవచ్చు.

**వెలగ పండుతో వైద్యం:**

జీర్ణ శక్తి సమంగా వుంచేందుకు వెలగ పండు అద్భుతమైన ఔషధం.

**అమీబియాసిస్ వ్యాధికి వెలగపండుతో వైద్యం :**

అమీబియాసిస్ వ్యాధి వున్నవారు మలము సరిగ్గా రాక, వచ్చినా చాలా కష్టంగా తీర్చుకోవలసి వస్తుంది. ఇటువంటి లక్షణాలనే అమీబియాసిస్ అంటారు. ఇటువంటి వారు వెలగ పండు లోపలి గుజ్జును తీసుకుని మజ్జిగలో వేసి



బాగా పిసికి ఆ ద్రావణాన్ని తీసుకోవాలి. అంతేగాని వెలగ పండును నేరుగా తినకూడదు. ఎందుకంటే ఇది గొంతును పట్టేసే గుణం గల పండు కాబట్టి ఎప్పుడూ వెలగ పండును బెల్లం, చక్కెర, పెరుగు, మజ్జిగ లాంటి వాటితో కలిపే తీసుకోవాల్సి వుంటుంది. ఈ పండును పైవిధంగా తీసుకోవటం వల్ల మల విసర్జన సంబంధిత రోగాలన్నింటికి సమర్థవతంగా పని చేస్తుంది. మొలల వ్యాధి వున్న వారికి కూడా ఇది బాగా పని చేస్తుంది.

**బాలింతలకు పాలు పెరగటానికి వెలగ :**

కొందరు బాలింతలకు పాలు సరిగ్గా పడక పుట్టిన పిల్లలకు పాలు సరిపోక బాధ పడుతుంటారు. అటువంటి వారు వెలగ పండు గుజ్జును తీసుకుని అందులో కొద్దిగా బెల్లం లేదా చక్కెరలను కలుపుకుని తీసుకుంటే పాలు అభివృద్ధి చెందుతాయి. అయితే వెలగ పండు విత్తనాలు త్వరగా అరగవు కాబట్టి విత్తనాలను తీసివేసి, గుజ్జును మాత్రం బెల్లం లేదా చక్కెరలో కలుపుకుని తింటే మంచిది.

**చుండ్రు వ్యాధి నివారణకు వెలగ పండు :**

తలలో చుండ్రుతో బాధపడుతున్న వారు వెలగ పండు తీసుకుని అందులోని గుజ్జును తీసివేసి, పైనున్న టెంకను బాగా కాల్చి, ఆ బూడిదను కొబ్బరినూనె లేదా నువ్వుల నూనెలో కలిపుకుని తలకు పట్టించుకున్నట్లయితే తలలో చుండ్రు నివారణ త్వరగా జరుగుతుంది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

## స్పందన

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

"పల్లెసృజన" మే-జూన్ 2019 సంచిక నాకు చేరిన గంటలోనే మొత్తం పత్రికను చదివేదాకా మనసొప్పలేదు. మీరు ప్రతినెలా ప్రచురిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. ఇది నా స్వార్థం. మీరు ఈ పత్రికకై ఎంత శ్రమ పడుతున్నారో మాకు తెలుసు. ప్రజల శ్రేయస్సుకై సమానాంతర జ్ఞాన విస్తరణకై పాటుపడుతున్న 'పల్లెసృజన' బృందానికి నా నమస్సులు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు 'పల్లెసృజన' కృషిని గుర్తించి, వారి గమ్యాన్ని గమనించి, చట్టపరంగా ప్రజల శ్రేయస్సుకై కొన్ని పాలసీలు తయారు చేస్తే బాగుంటుందని నా విశ్వాసం.

– **శ్రీనివాస రెడ్డి**, విజయవాడ. ఫోన్ : 95812 50490

**శ్రీనివాస రెడ్డి గారూ,**

మీ అభిమానానికి కృతజ్ఞతలు. ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయి. ఇంకా ఎన్నో కార్యక్రమాలు 'పల్లెసజన' సహకారంతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో చేపడతాయని మా ప్రగాఢ విశ్వాసం.

– **బ్రిగేడియర్ గణేశం**

**రాఘవరెడ్డి గారికి,**

తరతరాలుగా వస్తున్న కలుపు తీయటానికి అయ్యే ఖర్చులను మేము ఊహించని విధంగా, గణనీయంగా తగ్గించటానికి మీ ద్వారా వెలుగులోకి వచ్చిన పరికరం 'కుర్పీ' గురించి మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ప్రతి సంవత్సరం 5 ఎకరాల పొలంలో వంద మందికి పైగా పట్టే కూలీల ఖర్చు కేవలం 20 మందితో పూర్తయ్యేలా చేసినందుకు మీకెలా ధన్యవాదాలు తెలియజేయాలో అర్థం కావటం లేదు. అంటే నా పొలం కలుపు కూలీల ఖర్చు ఒక్కసారికే నేరుగా రూ. 20 వేలకు పైగా మిగిలింది. ఇంత గొప్ప ఇన్నోవేషన్‌ను వెలుగులోకి తీసుకు వచ్చినందుకు 'పల్లెసృజన'కు రైతాంగం ఎప్పుడూ కృతజ్ఞతతో వుంటుంది.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభలో పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు 'పల్లెసృజన' చేస్తున్న పనులను గురించి వివరించటం నేను ప్రత్యక్షంగా వీక్షించాను. మీరు చేస్తున్న పనులను సభాపరంగా రాంభూపాల్ రెడ్డి గారు 'రైతు లోకానికి పల్లెసృజన చేస్తున్న కృషిని యావత్ రాష్ట్రానికి తెలియజేయడం ఆనందంగా అనిపించింది. ఆ మాటల్లో నేను మీతో "100 మంది చేసే పనిని 20–30 మందితో చేసేలా ఇన్నోవేషన్లను వెలుగులోకి తెచ్చిన పల్లెసృజన" అన్న మాటలు శాసన సభలో వారి నోటివెంట విని, వీళ్ళు ఎంత పారదర్శకంగా వుంటారు అనిపించింది. ఇలాంటి చిన్న చిన్న పరికరాలు మీ దృష్టిలోకి ఏవి వచ్చినా నాకు దయచేసి తెలియజేయగలరని ఆశిస్తున్నాను.

– **కేశవనాయుడు**, జి. కొత్తపల్లి గ్రామం, రాప్తాడు మండలం, అనంతపురం జిల్లా.

**కేశవ నాయుడు గారికి,**

మీరు చెప్పినట్లుగా చిన్న వ్యవసాయ పరికరమైన 'కుర్పి' ఎంతోమందికి మేలు చేసినట్లు మా దృష్టికీ వచ్చింది. 'పల్లెసృజన' అభిప్రాయం కూడా ఇన్నోవేషన్ పెద్దది లేదా చిన్నది అన్నది అది ప్రజలకు చేసే మేలును బట్టే అని మేమూ నమ్ముతాం. ఇక 'పల్లెసృజన' కృషిని శ్రీ రాంభూపాల్ రెడ్డి గారు శాసన సభలో ప్రస్తావించడం మాకూ ఆనందం ఇవ్వటమే కాక, ఇంకా ఉత్సాహంగా పని చేయడానికి ప్రోత్సాహకారిగా నిలిచింది.

– **వీరరాఘవ రెడ్డి.**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to,be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

### కొడవలితో కలుపు తీసే సాంప్రదాయ పనిలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చిన

# సృజనాత్మకమైన పనిముట్టు "ఖుర్పి"



పూర్వం నుండి అన్ని రకాల పంట పొలాల్లో 'కలుపు తీయటం' అనే పనిని ఇప్పటి వరకు 'కొడవలి' అనే పరికరం మహిళలు మాత్రమే కూర్చుని లేదా వంగి తీయటమే తప్ప తరతరాల నుండి వస్తున్న ఈ పనికి ప్రత్యామ్నాయం ఏ ఇంజనీర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కనిపెట్టక పోవటం దురదృష్టం. ఇదివరకు కూలీల లభ్యత బాగా లభించేటపుడు రైతుకు పెద్దగా బాధగా అనిపించలేదు. కానీ మారుతున్న కాలంలో ఇప్పుడు కలుపు తీసే కూలీలే లభించే పరిస్థితి లేదు. లభించినా విపరీతమైన కూలీ రేట్లు వుండటంతో గతిలేని పరిస్థితుల్లో రైతులు రసాయన కలుపు నివారణ మందులపై విపరీతంగా ఆధారపడటం వల్ల కాలుష్యం, మనుషుల ఆరోగ్యంపై ఎంతో ప్రభావాన్ని చూపుతున్న విషయం రైతులందరికీ విదితమే. ఇటువంటి పరిస్థితుల్లో ఒక సాధారణ వ్యక్తి, రైతుకుటుంబంలో జన్మించిన 'నిహాల్' అనే మహారాష్ట్రకు చెందిన వ్యక్తి రూపొందించిందే 'ఖుర్పీ' అనే ఈ అద్భుతమైన పరికరం. దీని సహాయంతో ప్రస్తుతం ఒక మహిళ ఒక గంటలో చేసే పనిని మగ మనిషి కేవలం 3 నుండి 5 నిమిషాల్లో తీయగలుగుతున్నాడు. అంటే కలుపు కూలీలు 80 నుండి 90 శాతం వరకు మిగులుతోంది. రైతుకు వ్యవసాయంలో అయ్యే ఖర్చుల్లో ప్రధానమైన ఖర్చు కలుపు నివారణ. దాన్ని మిగిలించిన పరికరం తయారు చేసిన ఇన్నోవేటర్‌ను ప్రతి రైతు అభినందించి తీరుతాడు.



అనంతపురం జిల్లాకు చెందిన 'కేశవ నాయుడు' అనే రైతు ఇటీవల తాను తీసుకున్న ఈ పరికరాలతో తన ఐదెకరాల పొలంలో కలుపు తీసిన తర్వాత వీటిని సరఫరా చేసిన రాఘవ రెడ్డితో మాట్లాడుతూ "అయ్యా, నా ఐదెకరాల పొలంలో కలుపు తీయటానికి వంద మందికి పైగా పట్టే వారు. అలాంటిది ఈ పరికరాల సహాయంతో కేవలం 20 మందితో కలుపు తీయించ గలిగడం వల్ల మిగిలిన కూలీల ఖర్చు నాకెంతో ఆనందంగా వుంది. యావత్ రైతాంగం వీటిని తప్పకుండా ఉపయోగించు కుంటారు. దీన్ని ఉపయోగించటం కూడా ఎంతో సులభం. కేవలం కొద్ది నిమిషాల్లోనే బాగా అలవాటైపోతుంది. కూలీలు కూడా ఎటువంటి అలుపు లేకుండా 'బరా బరా' గీక్కుంటూ వెల్తుండటం చూస్తుంటే భలే చూడముచ్చటగా వుంది" అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

<u>పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :</u>

**పి. వీరరాఘవ రెడ్డి, పల్లెసృజన, 77, వాయుపురి, సికింద్రాబాద్ - 500 090.**


**ఫోన్ : 81257 99904/ 7989038186**


PALLE SRUJANA Telugu Bi-monthly July-August 2019 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన


## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**





























**పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.**

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,600/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- | 4,000/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904